# వాణి

తెలుగు అసోసియేషన్ సిడ్నీ

సంపుటి 64 సంచిక 143 నవంబర్ 21


పూని ఏదైనా ఒక మేలు చేసి జనులకు చూపవోయి



రాధామాధవమ్

# విషయ సూచిక

సంపాదకీయం – విజయ మాధవి గొల్లపూడి..........................................................................................1

సెక్రెటరీ రిపోర్ట్ – అపర్ణ సుసర్ల..... ..................................................................................................2

## శీర్షికలు

శ్రీమద్భగవద్గీత – రంగారావు పెయ్యేటి ..........................................................................................4

స్వేచ్ఛాభారతి వజ్రోత్సవ శోభ – విజయ గొల్లపూడి.......................................................................15

జీవనయానం- రంగారావు పెయ్యేటి ..........................................................................................16

శతవసంతాల సుస్వరం.................................................................................................................18

మహాసభలూ ఆహ్వానిత అతిధి భాగోతాలు - చిట్టెన్ రాజు వంగూరి .............................................................20

మై హూం యమధర్మరాజ్- కమల పరచ.........................................................................................23

సంగీత నాదామృతం - డా. పద్మ మల్లెల ..........................................................................................27

బాలవాహిని .......................................................................................................................29

అదే గమ్యం- అరుణ శర్మ నిమ్మగడ్డ ................................................................................................31

పాఠకుల స్పందన.................................................................................................................42

నీహారిక – గొలుసు కట్టు నవల ...................................................................................................44

కార్తీక పౌర్ణమి ...................................................................................................................47

చిత్రకళ-ప్రసూన రవీంద్రన్.......................................................................................................55

పాట నేర్చుకుందామా/పాడుకుందామా ..........................................................................................49

శిధిల నగరం - జి.వి. సోమనాధ శాస్త్రి.............................................................................................50

Telugu Association Inc.
PO Box -1382, Parramatta, NSW 2124
ABN : 56 303 933 034
www.sydneytelugu.org
పూని ఏదైనా ఒక మేలు చేసి జనులకు చూపవోయి!

email: vahini@sydneytelugu.org


| ఎడిటర్ | అసోసియేట్ ఎడిటర్ | కో-ఆర్డినేటర్ |
|---|---|---|
| విజయ మాధవి గొల్లపూడి | సాయి లక్ష్మీనారాయణ గొల్లపూడి | ప్రసాద్ రాంబొట్ల |

# సంపాదకీయం

నవంబర్ నెల సిడ్నీ వారి తెలుగువాహిని మాసపత్రిక పాఠక మహాశయులకు సవినయ నమస్సులతో పఠనానికై అహ్వానిస్తున్నాము. రాధామాధవుల ప్రేమ అజరామరమైనది, అరమరికలు లేని ప్రేమ, అన్నిటికీ అతీతమైన వారివురి ప్రేమ లోకానికి ఆదర్శం. ఆ జంట ప్రేమను సంగీతంలో, నాట్యంలో, కావ్యగానంలో, జయదేవ అష్టపదులకు ఇలా ఎన్నిటికో మూలమైనది. వారిరువురిని జీవాత్మ, పరమాత్మ కలయికలుగా కూడా భావిస్తారు. రాధామాధవుల ముఖచిత్రంతో కార్తీకమాసం లో వాహిని పత్రికను వెలువరించాము.

ఈ నెలలో ఒక ప్రత్యేక ఆకర్షణ గా ప్రముఖ రచయిత్రి శ్రీమతి జలంధర చంద్రమోహన్ గారి కథలు వాహినిలో అందిస్తున్నాం. వాహిని బృందం జలంధరగారికి ధన్యవాదాలు తెలియచేస్తోంది. వారి శ్రీవారు చంద్రమోహన్ గారు జగమెరిగిన ఆంధ్రుల అభిమాన నటులు.

ఎట్టకేలకు ఆస్ట్రేలియా లో సరిహద్దు రేఖలు తెరుచుకుని, విమానయానంతో ఆప్తులను, బంధువులను కలుసుకోవడానికి ప్రభుత్వం అనుమతించడంతో జనజీవనస్రవంతి సాధారణ స్థితికి చేరుకుంటోంది ఇపుడిపుడే.

జీవితానికి కావలసిన అత్యవసర దినుసు ఆనందం, సంతోషం. ప్రతి వ్యక్తి కోరుకునేదదే. స్నేహితులు, బంధువులను కలుసుకున్నపుడు ఆ ఆనందం రెట్టింపవుతుంది. వివాహాలు, వేడుకలు, పండుగలు, పర్వదినాలు, పూజాదికాలు, వ్రతాలు భారతీయులకు సంవత్సరమంతా ఆనందంగా గడవటానికి మన పూర్వులు నిర్దేశించారేమో! వైవిధ్యమైన, వినోద, విజ్ఞాన భరితమైన జీవనవిధానం, అనాదిగా వస్తున్న ఆచారాలు, విధి విధానాలు సనాతన ధర్మం నుంచి మనకి సక్రమించిన విలువైన సంపద. అటువంటి సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ భావితరాలకు అందించగలిగితే జీవితం సఫలమైనట్లే కదా!

తెలుగువాహిని మాసపత్రిక ద్వారా మా ప్రయత్నంగా విలువైన విషయాలను మీకు అందించడానికి కృషి చేస్తున్నాము. మరి ఆలస్యం చేయకుండా వాహిని పూర్తిగా చదివి మీ అభిప్రాయాలు తెలియచేయగలరని ఆశిస్తూ

మీ శ్రేయోభిలాషి

**విజయ గొల్లపూడి**

**0438293687**

**vahini@sydneytelugu.org**

## ఎక్జిక్యుటివ్ కమిటీ


ప్రెసిడెంట్: మధు బైరెడ్డి
0425 209 397


వైస్ ప్రెసిడెంట్: మోహన్ కుమార్ పరసు
0419 219 526


సెక్రెటరీ: : అపర్ణ సుసర్ల
0424 558 371


ట్రెసరర్: హరిబాబు కొల్లూరి
0425 291 032


కమిటీ మెంబర్: వీర్రాజు గున్నం
0431 714 501


కమిటీ మెంబర్: కామేశ్వరి ఉడత
0424 937 166


కమిటీ మెంబర్: ప్రసూన కంభంమెట్టు
0405 445 662

## సబ్ కమిటీలు


తెలుగు వాణి కన్వీనర్ :
రాజా తల్లాప్రగడ
0422 953 668


తెలుగు వాహిని ఎడిటర్:
విజయ గొల్లపూడి 0438 293 687


తెలుగు బడి కోఆర్డినేటర్
రావు పెద్దాడ 0456 226 000


వనితా మండలి కోఆర్డినేటర్
శోభ వెన్నలకంటి - 8901 3636


వెబ్ అడ్మిన్ : అపర్ణ సుసర్ల
0424 558 371


సిడ్నీ తెలుగు సీనియర్స్ కోఆర్డినేటర్
రవి సీతంరాజు

## ఆఫీసర్స్


మూర్తి పోతుకూచి-రిటర్నింగ్ ఆఫీసర్


ఆడిటర్
మధు వెన్నెలకంటి


పబ్లిక్ ఆఫీసర్
రవి సీతంరాజు

# SECRETARY REPORT

Dear Members,

A very warm Greetings from Executive Committee (EC)!

Thank you all for your ongoing commitment and support. October 2021 has been busy month for all executive and sub-committees with completion of financial reports and getting ready for AGM.

The EC has been working closely with sub-committees and the summary of activities are shared below:

- Telugu Badi have come up with a new initiative to teach Telugu language for ages 14 years and above. Three levels of short courses are planned run over 8 weeks period. The first Beginner online short course commenced with 18 students on 5 Oct 2021.
- We are looking to form a Telugu Youth Committee with 5 volunteers who can work closely with Executive Committee, set up a new subcommittee embedding STA values and objectives,
- Telugu Badi annual event has been planned for 11 Dec 2021. The event will be held on-premise at Regents Park Temple. The students and teachers are enthusiastic to have a face-to-face event after a long gap.

Please welcome who joined as STA life member Mr. Maruthi Dhurjati

**Please save the date for AGM 2021- Sunday 12th December from 3:00 to 7:00 pm. AGM pack will be release soon along with nomination forms to appoint new Executive Team.**

Best Regards,
Aparna Susarla,
Secretary Sydney Telugu Association.



**Telugu Vahini**

**తెలుగు వాహినికి మీ రచనలు పంపడానికి, సూచనలు, స్పందనలు తెలుపడానికి మీరు పంపవలసిన మా చిరునామా - vahini@sydneytelugu.org**

Newsletter of Telugu Association Inc., Sydney published in *Telugu*,
The second largest language spoken in India
Please visit sydneytelugu.org and subscribe to Vahini monthly magazine to receive by e-mail.

❖❖❖❖❖

**విజ్ఞప్తి**

మీ శీర్షికలు, వాణిజ్య ప్రకటనలు వాహిని పత్రికలో ప్రచురించడానికి, విజయ మాధవి గొల్లపూడి vahini@sydneytelugu.org ద్వారా సంప్రదించగలరు. మీ ప్రచురణలు ప్రతి నెల 25వ తారీఖు లోపల పంపవలసినదిగా విజ్ఞప్తి. మీ రచనలతో పాటు ధ్రువీకరణ పత్రము, వాహినిలో ప్రచురించుటకు అంగీకార పత్రము జతపరచగలరు.

Disclaimer: It may be that this magazine uses some freely available content and material from web purely for informative purposes.

❖❖❖❖❖

భాష్యం: శ్రీ పెయ్యేటి రంగారావు, హైద్రాబాద్



**అథ ద్వితీయోధ్యాయః - సాంఖ్యయోగః**

(రెండవ అధ్యాయము - సాంఖ్యయోగము)

66,

నాస్తి బుద్ధిరయుక్తస్య న చాయుక్తస్య భావనా |

న చాభావయతః శాంతిః అశాంతస్య కుతః సుఖమ్ || 66 ||

అయుక్తస్య = ఇంద్రియములను, మనస్సును వశమునందుంచుకొనని వానియందు

బుద్ధిః = నిశ్చయాత్మకబుద్ధి

న, అస్తి = వుండదు.

చ = మరియు

అయుక్తస్య = ఇంద్రియనిగ్రహము, మనోనిగ్రహము లేనివానికి

భావనాచ = ఆత్మచింతనయు

న = ఉండదు.

అభావయతః = ఆత్మచింతన లేనివానికి

శాంతిః చ = శాంతియు

న = కలుగదు

అశాన్తస్య = శాంతి లేనివానికి

సుఖమ్ = సుఖము

కుతః = ఎక్కడిది?

ఇంద్రియాలను, మనస్సును అదుపులో వుంచుకొన లేనివానికి వివేకము, ఆత్మచింతన వుండవు. ఆత్మచింతన లేనివానికి శాంతి లభించదు. శాంతి లేనివానికి సుఖమేముంటుంది?

దృశ్యపదార్థాలయందు, విషయభోగాలయందు దొరికే సుఖం నిజమైన సుఖం కాదు. అది ప్రతిబింబసుఖం. క్షణికమైనది. అది సుఖదుఃఖాలను కలిగించేది. అలాకాక నిజమైన, శాశ్వతమైన, పరిపూర్ణమైన సుఖం లభించాలంటే చిత్తంలో శాంతి ఏర్పడాలి. అటువంటి శాంతి లభించాలంటే శాశ్వతమైన ఆత్మను, దైవాన్ని ధ్యానించాలి. ఐహికసుఖాలనుంచి మనస్సును మఱలించుకుని, మనస్సును నిర్మలంగా వుంచుకున్నప్పుడే భగవంతుని వైపు దృష్టి మరలుతుంది.

ముముక్షువులకు సమ్యగ్జ్ఞానము లేనిదే ముక్తి లభించదు. సమాధి లేనిదే సమ్యగ్జ్ఞానము లభించదు. ఇంద్రియనిగ్రహము లేనిదే సమాధి సిద్ధించదు. నిశ్శేషంగా రాగాన్ని విడిచిపెట్టనిదే ఇంద్రియనిగ్రహం కలుగదు.

'యతతో హ్యపి కౌన్తేయ!' అనునది మొదలగు గ్రంథముచే రాగద్వేషపరిత్యాగమును, ఇంద్రియనిగ్రహమును, సమాధ్యనుష్ఠానమును చెప్పి, 'ధ్యాయతో విషయాన్పుంసః' అనుదానిచే బహిర్ముఖుడగు జ్ఞానికి జ్ఞాననాశాద్యనర్థము ప్రాప్తించునని ప్రతిపాదించి యిపుడనేక విధముల వేదాంతములను వినియు, శిష్యులకు చెప్పియు, పఠనసాధనమాత్రము చేతనే తనను కృతార్థునిగ తలచునట్టియు, దుర్బుద్ధి చేతను, ఆలస్యము చేతను ధ్యానాదులయందప్రవృత్తుడగు ముముక్షువవశ్యము సమాధి నాచరింపవలెనని సూచించుటకు సమాధినాచరింపని వానికనర్థమును 'నాస్తి బుద్ధిరయుక్తస్య' అను శ్లోకముచే చెప్పుచుండెను.

'నచాభావయతశ్శాంతిః' - శ్రుతము, దృష్టము, స్పృష్టము, మతము, విజ్ఞానము, తాను సర్వము చిద్రూపమగు బ్రహ్మమే' యని సర్వమునకు చిన్మాత్రత్వమును నిత్యము నిరంతరము చిదాత్మకవృత్తిచే భావింపని యవిద్వాంసునకు చిదానందైక రసబ్రహ్మస్వరూపముచే నవస్థానమనెడి శాంతి సంభవింపదు. ఇట్లు విదేహముక్తిని పొందనివానికి విదేహకైవల్యసుఖము ప్రాప్తింపదు.

67,

ఇంద్రియాణాం హి చరతాం యన్మనో౽ నువిధీయతే |

తదస్య హరతి ప్రజ్ఞాం వాయుర్నావమివాంభసి || 67 ||

చరతాం ఇంద్రియాణాం = విషయములయందు ప్రవర్తించుచున్న ఇంద్రియములలో

యత్ = ఏ యింద్రియమును

మనః = మనస్సు

అనువిధీయతే = అనుసరించి పోవుచున్నదో

తత్ = ఆ యింద్రియము

అస్య = దీనియొక్క

ప్రజ్ఞామ్ = వివేకమును

అంభసి = నీటియందు

నావమ్ = ఓడను

వాయురివ = (ప్రతికూల) వాయువు వలె

హరతిహి = ఈడ్చుకొనిపోవుచున్నది గదా!

నీటిలో వున్న ఓడను ఏవిధంగానైతే ఎదురుగాలి పెడదారికి లాక్కుని పోతుందో, అదే విధంగా ఏ ఇంద్రియమైతే విషయవాంఛలలో చిక్కుకుని వుందో, ఆ ఇంద్రియము మానవుని యొక్క వివేకాన్ని హరించివేసి పెడదారి పట్టిస్తుంది.

ఏ ఒక్క ఇంద్రియమైనా ఐహికమైన విషయవాంఛలలో చిక్కుకున్నట్లయితే అది మానవుడిని పెడదారి పట్టిస్తుంది. అటువంటప్పుడు ఇంద్రియాలన్నీ శబ్దస్పర్శాది విషయాలలో చిక్కుకున్నట్లయితే ఇంక ఎంత చేటు వాటిల్లుతుందో చెప్పడానికి వీలుకాదు. అందువలన ఇంద్రియాలను విషయవాంఛల వైపు పోకుండా నిరోధించాలి. అలాగే మనస్సును కూడా నిగ్రహించుకోవాలి.

అందువల్ల శ్రోత్రాది జ్ఞానేంద్రియాలను, వాగాది కర్మేంద్రియాలను తమతమ విషయములయందు ప్రవర్తించనీయకుండా నిరోధిస్తూ, మనసును కూడా నిశ్చలంగా వుంచుకుని సాధన చేస్తేనే బ్రహ్మజ్ఞానం లభిస్తుంది.

68,

తస్మాద్యస్య మహాబాహో! నిగృహీతాని సర్వశః |

ఇంద్రియాణీంద్రియార్థేభ్యః తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా || 68 ||

తస్మాత్ = అందువలన

మహాబాహో = గొప్పబాహువులు కల ఓ అర్జునా!

యస్య = ఎవనియొక్క

ఇంద్రియాణి = ఇంద్రియములు

ఇంద్రియార్థేభ్యః = ఇంద్రియవిషయముల నుండి

సర్వశః = అన్ని విధముల

నిగృహీతాని = నిగ్రహింపబడునో

తస్య = అతనియొక్క

ప్రజ్ఞా = బుద్ధి

ప్రతిష్ఠితా = స్థిరమగును.

కనుక ఓ అర్జునా! ఇంద్రియములను ఇంద్రియవిషయముల నుండి అన్ని విధములుగ పూర్తిగా నిగ్రహించిన పురుషుని యొక్క బుద్ధి స్థిరముగా నుండును.

'సర్వశః' అని చెప్పటం వలన ఇంద్రియములను కొంచెం నిగ్రహిస్తే సరిపోదని, పరిపూర్ణంగా నిగ్రహించాలని, అన్ని విధాల ప్రయత్నం చేసి సర్వేంద్రియాలను లొంగదీసుకోవాలని స్పష్టపరచడం జరిగింది.

'మహాబాహో' అని సంబోధించడం వలన, నీవు శత్రువులందరను జయించగల శక్తిసామర్థ్యాలు కలవాడివి. అలాగే ఇంద్రియాలనే శత్రువులను (అరిషడ్వర్గాలను) కూడా జయించగల సమర్థత నీకుంది సుమా అని చెప్పడం జరిగింది.

రాగద్వేషలోభమోహాది దోషాల వల్లనే ఇంద్రియాలకు విషయప్రవృత్తి సంభవిస్తుంది. అటువంటి ప్రవృత్తి వున్నప్పుడు సమాధి ఏర్పడదు. సమాధి లేకపోతే జ్ఞానం కలగదు. అందువల్ల బ్రహ్మరూపమైన స్వాత్మయందు అహంభావము కలగదు. అట్టి అహంభావం లేకపోతే ముక్తి దుర్లభమవుతుంది. ముక్తి లభించకపోతే సుఖం సంప్రాప్తించదు. అందుచేత ఇంద్రియలోలునికి సర్వానర్థాలు సంభవిస్తాయి. ఇంద్రియసముదాయానికి రాగద్వేషాదులు లేకుండా చేసి సమాధిననుష్ఠించాలని తెలియజేయడానికి 'తస్మాత్' అని చెప్పడం జరిగింది.

**ఓం నమో భగవతే వాసుదేవాయ!**

❖❖❖❖❖

శ్రీమతి జలంధర చంద్రమోహన్, హైద్రాబాద్

# అగ్నిపుష్పం

రాధనీ యశోదనూ ఒకే స్త్రీలో దర్శించారా ఎవరైనా? హారతి గురించి చెప్పాలంటే ఆ మాట చాలు.

నేను సైంటిస్ట్‌ను. ఆధి భౌతికమైన విషయాలు, పరీక్షలకు నిలబడని అజ్ఞానాలు అంటే అసలు గిట్టదు నాకు. మానవ స్వభావానికి కారణమైన జీన్స్ మీద అనేక రకాల పరీక్షలు చేసి బహుమతులు పొందాను నేను. త్యాగాలకు, స్వార్థానికి. లౌక్యానికి, నిశృష్టతకు కూడా మనిషిలోని జీన్స్ కారణం అని తెలిసినప్పుడు. జంతువులే ఈ థియరీ ప్రకారం ప్రవర్తిస్తున్నప్పుడు, మానవత్వం, ఔన్నత్యం – వీటి మీద పెద్ద నమ్మకం లేదు నాకు. కవిత్వాలు, సౌందర్యారాధనలు – ఇవన్నీ మనిషిలోని ఉన్మాదావస్థకు చిహ్నాలనిపించేవి. ఏ సెంటిమెంట్లూ లేని నాకు 'భగవంతుడు' మనిషి ఊదిన ఊహలబెలూనులాగా కనిపిస్తాడు. కానీ, విచిత్రమేమిటంటే – మనిషి తననుకున్నట్లు, తను ఆలోచిస్తున్నట్లు బ్రతకగలిగితే మానవ సమాజం మరొకవిధంగా ఉండేదేమో కానీ, వ్యక్తి సంఘజీవి. నా ఏరకమైన ఆలోచనలతోనూ నా చుట్టూ ఉన్న మనుష్యులకు సంబంధం ఉండదు. కేవలం ప్రేమతోనో, అభిమానంతోనో, సంపాదనపరుడననే గౌరవంతోనో నా ఆలోచనలు విన్నట్లు, గౌరవించినట్లు నటించేవారు. ఆ విషయం అర్థమైనప్పుడల్లా, నాకు హైపర్ టెన్షన్ వచ్చేది. అంతే. నేను మహా కోపిష్టినని ముద్ర వేశారు. కానీ, అందరి మనుష్యుల్లాగే నాకూ కొన్ని బలహీనతలు ఉన్నాయి. అందులో అతి ముఖ్యమైనది నా ఆలోచనలను ఎదటివారి మీద బలవంతంగా రుద్దడం, కన్నీరు తెప్పించడం – ఆ తరవాత ఆ బాధ చూడలేక లొంగిపోవడం. ఈ గుణం నాలో తెలియని మార్పులు ఎన్నో సృష్టించింది.

"పెళ్ళేమిటి? సెన్టిమెంటల్ నాన్సెన్స్ ... మారేజ్ ఈస్ ఎ మోస్ట్ ఎకనామికల్ వే ఆఫ్ గెటింగ్ ఫుడ్ అండ్ సెక్స్...." అని వాదించే నన్ను మా అమ్మ కన్నీళ్ళు, మా నాన్న బాధ లొంగదీసుకున్నాయి. 'ఒక్కగానొక్క పిల్లాడివిరా' అనే మావాళ్ళ మాట నా అహానికి తృప్తి కలిగించింది. "వాళ్ళపిల్లకు వాళ్ళు సరదాగా పెట్టుకుంటూంటే మధ్య నీ బాధ ఏమిటిట?" అని కసిరి, మావాళ్ళు కట్నం కూడా పుచ్చేసుకున్నారు. నా ఆలోచనలను, ఆశయాలను అగ్నిహోత్రం పాలుచేసినట్లు– మండిన కళ్ళతో, పెళ్ళి తంతును తిట్టుకుంటూ, పెళ్ళిపీటలమీద కూర్చున్న నాకు కనబడింది ఆమె.

ఇన్నాళ్ళ తరవాత, ఈ యాభైయ్యవ పడిలో జీవితంలో మామూలు మనిషికి ఉండే అన్ని సౌఖ్యాలు పొందిన నేను ఒక్కసారి గతంలోకి తొంగిచూస్తూంటే ఏనాడో

సహం చదువుతూండగా పోయిన మంచి పుస్తకం మళ్ళీ దొరికినట్లనిపిస్తుంది హారతి జ్ఞాపకం. మామూలుగా బ్రతికేస్తున్న మనిషి ఆగి అప్పుడప్పుడు ఆలోచించుకుంటే, వేసవి ఎడారుల్లో మంచిగంధపు తుపానుల్లాంటి అందమైన అనుభూతులు ఉక్కిరిబిక్కిరి చేసేవి కొన్ని ఉంటాయి. మనిషి ఆయుఃపరిమాణం కాలానికి కట్టుబడితే, మనిషిలోని ఆత్మ అనుభూతుల వాసనతో అజరామరమౌతుంది. ఆత్మ...పూర్వజన్మ వాసనలు....ఇవన్నీ తరవాత చదివాను. నేను ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే, ఈ ఆలోచనలన్నీ ఆమె తరవాతవి.

"మీట్ మై డియరెస్ట్ ఫ్రెండ్ హారతి...." అన్నది అపుడే నామీద అధికారాలు సంతరించుకున్న నా భార్య

అసలే విసుగ్గా ఉంది ఈ పెళ్ళి తంతు. ఒక్కసారి అందరి మీదా విరుచుకు పడిపోయి లేచి పారిపోదామా అనిపిస్తున్న నేను తలెత్తి చూసి ఆటోమేటిక్‌గా చేతులు జోడించాను 'సూడో కల్చర్' అని తిట్టుకుంటూ. ఆమె... గులాబీరంగు చీర, చిన్న బొట్టు, కనీకనబడనట్లుండే నాజుకైన నగలు, కాటుకలేని కళ్ళు, చీరలో కలిసిపోయిన ఒంటిరంగు, హిమాచలాలే ఘనీభవించాయా అన్నట్లుండే ఆ కళ్ళు... అంతలో సౌందర్యానికి రవసెల్లా వేసినట్లు చటుక్కున కళ్ళు దించుకుని 'విష్ యు హాపీ మారీడ్ లైఫ్' అని సున్నితంగా చెప్పి, చేతులు జోడించి మెల్లిగా జనంలోకి వెళ్ళిపోయింది.

"ఎవరా అమ్మాయి?" అప్రయత్నంగా అడిగాను.

"నా స్నేహితురాలు..."

అటే చూశాను.. ఆమె లేదు.

మనిషికి మనిషికి మధ్య స్పందన అని ఎక్కడన్నా చదివితే విరగబడి నవ్వే నాకు ఎందుకో హారతిపట్ల ఏదో తెలియని అనుభూతి కలిగింది. అంతా ట్రాష్ అంటూనే ఆలోచిస్తున్నాను నేను.

"హారతి... అయినా అదేం పేరు?" అన్నాను ఆ తరవాత మాటల్లో నాభార్య శారదను కదిలిస్తూ.

"నిజమేనండీ! కర్పూరహారతిలాంటిదే దాని జీవితం. ఆలోచించే పెట్టారు వాళ్ళవాళ్ళు..." అంది శారద మెల్లిగా. నా భార్య చాలా సనాతనం. పొరపాటున కాలు తగిలితే ఎదుటివాళ్ళు ఇబ్బందిపడేదాకా వంగి కళ్ళకద్దుకోవడం, కనబడ్డ రాయికి, గోపురంలా కనిపించితేచాలు – అది ఏ ఇంటి బురుజైనానేమోనని ఆలోచించకుండా తలవంచి అర్ధనిమీలిత నేత్రాలతో దణ్ణం పెట్టడం, వాచీ పెట్టుకుని, ఆదే చేతికి గాజులు వేసుకునే కల్చరు, పసుపురాసిన కాళ్ళకు మట్టెలు పట్టాలు పెట్టుకుని హీల్సు వేసుకునే తత్వం, నేను ఏడిపించినకొద్దీ 'నా పద్ధతింతే' అని తేల్చి చెప్పే సున్నితమైన మొండితనం, అతి మంచితనం, కొంచెం – పెంకితనం ఇవన్నీ మూర్తీభవిస్తే నా శారద.

ఆ తరవాత హారతిని మళ్ళీ చూశాను మా ఇంట్లో. అదే మనిషి, అదే సున్నితమైన మాట, ఘనీభవించిన చూపు, పలుచని వెన్నెల్లాంటి చిరునవ్వు. కానీ, మాటలు? ఆ మనిషితో మామూలు ఆడవాళ్ళతో మాట్లాడినట్లు మాట్లాడడం చాలా కష్టమని అర్థమైంది నాకు.

శారద నమ్మకాల గురించి వెక్కిరించి ఏడిపిస్తున్నాను నేను. "ఒకరకంగా నిజమేనేమో. ఆమెది అజ్ఞానమైనా దానికి సెంటిమెంటు ఉంది. కొంత బలం ఉంది. "కానీ మీ అపనమ్మకాలన్నీ ఆకాశ దీపాల్లాంటివి. మీకు పూర్తిగా దేనిమీదా నమ్మకం లేదు సరే.... కనీసం అపనమ్మకం కూడా లేదే!" సన్నగా నవ్వుతూ అన్న మాటలకు తెల్లబోయి చూశాను నేను.

"నా గురించి ఏం తెలుసని అలా మాట్లాడుతున్నారు మీరు?...."

"తెలియక్కర్లేదు, చూశాను. మొన్న పెళ్ళి తంతులో మీకు ఏది ఇష్టమనిట అన్నీ అంత శ్రద్ధగా చేశారు? ఇదంతా నాన్సెన్స్, చెత్త అనుకుంటూనే అన్నీ ఆచరిస్తున్నారు మీరు. మీ ఐడియల్స్‌కు శత్రువులు ఎవరో కారు – మీరే.." అంది మళ్ళీ నవ్వుతూ.

నాకు కోపం ఎందుకు రాలేదో ఇప్పటికీ అర్థంకాదు. ఆ మాటే, ఆ తరువాత, మరింత పరిచయం పెరిగక అంటే, "కారణం ఒకటే..నేను వెక్కిరింపుగానూ, హేళనగానూ అనలేదు. హెచ్చరించాను...అంతకన్న యింకేం లేదు" అనేసింది.

"అంతకన్న ఇంకేం లేదా?" పరీక్షగా ఆమె కళ్ళల్లోకి చూస్తూ అన్నాను నేను. శారద టీ కప్ లోపల పెట్టడానికి వెళ్ళింది.

మెల్లిగా చూపు మార్చేసింది...."మీ మారేజ్ ఆల్బం కావాలి నాకు..." అంది. పరీక్షగా ఆమెనే చూస్తున్న నాకు ఆ మాటల్లో ఏదో ధ్వని... 'నీకు పెళ్లైంది' అనా? లేక, 'అలా మాట్లాడకూడదు' అనా? ఇంతవరకు ఎంతో మంది ఆడపిల్లల అల్లరి కబుర్లు విన్నాను నేను. కానీ, ప్రతి మాట వెనకాల ఏదో తెలియని ప్రతిధ్వని విన్నది 'హారతి'లోనే!

"చాలా అందమైంది కదూ, మీ ఫ్రెండ్..." అన్నాను ఆ తరవాత శారదతో.

చురుగ్గా చూసింది.. ఉలిక్కిపడ్డాను నేను. నా మాటల్లో తెలియని వాంఛ ఏదో వినిపించి ఉండాలామెకు.

"నా ఉద్దేశ్యం అది కాదు..." అని ఏదో చెప్పబోయాను.

"ఎందుకలా భుజాలు తడుముకుంటారు? అయినా, హారతిలాంటివాళ్ళు వేరు... దాని సౌందర్యం, తెలివితేటలు అడవి కాచిన వెన్నెలలా అయిపోయాయి. మానవత్వం లేదండీ వాళ్లాయనకు..."

"హారతికి పెళ్లైందా?" ఆశ్చర్యంగా అడిగాను.

"అంటే మీ ఉద్దేశ్యం? దానికి యిద్దరు పిల్లలు కూడా!"

ఇది నా ఊహకందని విషయం. హారతి... ఆవిడ నా ఊహల్లో తెలియని రూపుదిద్దుకుంటున్న గగనకుసుమం. ఆమె మామూలుగా పెళ్ళాడి, పిల్లల్ని కని.. ఛా!

ఛా! నా ఊహలకు పొంతన లేదు... ఏమిటిది? నేను కూడా ఇలా సెన్టిమెంటల్ ఇడియట్‌లా తయారౌతున్నాను? ఛా! అందరు ఆడవాళ్లు ఒకటే!

నోములకు నా భార్య హారతిని పిలవలేదు... అదేమని అడిగాను.

"అది రాదండీ! తను పసుపు కుంకుమలకు నోచుకోలేదు!" కళ్ళంబడి నీళ్ళతో అంది శారద.

"వాట్ నాన్సెన్స్ ఆర్ యు టాకింగ్.."

"నిజమండీ! దాని భర్త పోయాడు..."

ఒక్కసారిగా ఈ ప్రపంచమంతా నాకు గిర్రున తిరిగినట్లైంది.

"అయినా అదేం జబ్బు నీకు ...ఇంకా అలాంటి ఫూలిష్..."

"ష్! ఎక్కువ మాట్లాడకండీ! మా హారతి విషయంలో నాకు అల్లాంటివేం లేవు. నేను అనుభవించే నరకం మీకెలా అర్థమౌతుంది? అదీ, నేనూ పసిపిల్లల దగ్గర నుంచి స్నేహితులం. పందకాసుల బంగారం, లక్షరూపాయల కట్నం యిచ్చి చేశారు పెళ్లి వాళ్ళవాళ్ళు. అతనొక పెద్ద ఇంజనీరు. కాని, మనసు ఎదగలేదు...దానికి అన్యాయం జరిగింది. అతను విధించిన శిక్ష నుంచి అది బయటపడలేకపోతోంది..." చీర కొంగుతో కళ్ళంబడి నీళ్ళు తుడుచుకుంటూ అంది శారద.

హారతి కథ క్లుప్తంగా యిది:

ఎంతో కట్నంతో, మరింత సౌందర్యంతో వచ్చిన హారతిని ఆమె భర్త భరించలేకపోయాడు. ఆమె సౌందర్యం, ఆత్మాభిమానం అతని స్థాయికి దిగజారలేక పోయాయి. జీవితంలో ఎంత గొప్ప వస్తువైనా, డబ్బు రూపంలో దాని విలువేమిటని ఆలోచించే మనుష్యుల మధ్య నుంచి వచ్చిన అతని ఆలోచనలు చాలా అట్టడుగువి. అందుకనే, సున్నితమైన, సుకుమారమైన హారతిని భరించలేకపోయాడతను. హింసించాడు, బాధపెట్టాడు. వీటిని సహించేదేమో కానీ అనుమానించి మనసు మీద వాత పెట్టాడు. వాటికి తలవగ్గకపోనేమో కానీ, ఆమెకు ఏమాత్రం సరితూగని ఆడదానితో సంబంధం పెట్టుకున్నాడు. తన కోరికలకి, డబ్బుకు లంకె కుదరలేదు. ఏదో ఫ్రస్ట్రేషన్‌లో ఈ ప్రపంచం నుంచి శాశ్వతంగా శలవు తీసుకున్నాడు. కానీ, వెళ్ళిపోతూ, "ఈ అకాల మరణానికి కారణం హారతి" అని : తెలియజెప్పాడు. సంఘంలో, బంధువులనే రాబందుల మధ్య హారతి-అతి సున్నితమైన హారతి-చీకాకుల చిలకలా చిక్కింది. ఆమె కన్నీళ్ళు, ఆవేదన ఎవరికీ అర్థంకాలేకపోయాయి. బ్రతకకూడదు అనుకుందామంటే పసిపిల్లలు కాలికి అనుబంధాలై పోయారు.

అన్నపూర్ణ విగ్రహం ముందు తానే వెలిగే హారతిగా మారి, అనంతమైన చీకటిలోని మృత్యురేఖగా వచ్చి తనను తీసుకుపొమ్మని ఎన్నోసార్లు ప్రార్థించింది హారతి. బ్రతకక తప్పదనుకున్నప్పుడు అందంగా, తెలివిగా బ్రతకటానికి అలవాటు పడింది. ఏదో ఉద్యోగం చేస్తోంది.

ఈ కథ నాలో చీకటి కోణాల తలుపుల్ని బలవంతంగా లాగి తెరిపించింది. ఉక్కిరిబిక్కిరి చేసింది. ఏమిటావిడ జీవితం! ఏదో కనబడని వక్రరేఖలు, వినబడని అపశ్రుతులు.

"ఇది నిజమా? అటువంటి రాక్షసుణ్ణి ఎలా భరించారు?" అని అడిగాను హారతిని కలిసినప్పుడు... ఎక్కడికీ రాని హారతి, శారద బలవంతం మీద అప్పుడప్పుడు మా ఇంటికి వస్తుంది.

"అనవసరంగా తిట్టకండి...అతని లెవల్ అంతే. అందుకే పెళ్ళి చేసేటప్పుడు స్థాయి చూడాలంటారు మనవాళ్ళు. ఐశ్వర్యాలస్థాయి చూస్తారు కానీ, మానసికమైన వాటి గురించి ఆలోచించరు. నా ప్రవర్తన అతనిలో ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్‌ని నిద్ర లేపింది. నాకూ చిన్నతనం కదా! కలలలో బ్రతికే వయస్సు. అతనిలో తక్కువతనాన్ని భరించలేక రెచ్చగొట్టేదాన్ని. దాని ఫలితం–ఇదుగో యిలా పరిణమించింది. కొన్ని తప్పించుకోలేం... మా వాళ్ళు చూసిన జాతకాలు, పెట్టిన ముహూర్తాలు..."

"అంతా ట్రాష్...ఏమైంది యిప్పుడు?"

"అలా అనెయ్యకండి. అన్నింటి వెనకాలా ఏదో తెలియని ఫోర్స్ ఒకటి వుంటుంది. జ్యోతిశ్శాస్త్రం తప్పనకండి. యోని పొంతనాలూ, మీ జీన్స్‌థియరీ ఒకటేనేమో... మీరు చెప్పే, అల్ట్రూయిసమ్, సెల్ఫిష్‌నెస్, స్ప్రైట్‌థియరీలన్నీ ఒకప్పుడు భర్తృహరి సుభాషితాలు చెప్పాయి. మనిషి స్వార్థం కోసరం శాస్త్రాన్ని మార్చుకుంటే చెప్పలేం కానీ, లేకపోతే తెలుసుకోవాలంటే చాలా వుంది."

ఏమిటీ అమ్మాయి – అర్థం కాలేదు నాకు... ఎప్పుడు ఏ విషయం అవునంటుందో, ఎప్పుడు కాదంటుందో, ఎందుకలా అంటుందో, చిక్కుముడి అంతా...

"ఇంత తెలిసి మరి మిమ్మల్ని మీరే సంఘం నుంచి యిలా దూరం చేసుకుంటున్నారెందుకని....?'

"ఏంలేదు. మొదట్లో బాధగా వున్నా, తరవాత అలవాటైంది. ప్రపంచానికి దూరంగా గాలరీ సీట్లో కూర్చుని జీవితాన్ని సమీక్షిస్తున్నట్లుంది."

రోజురోజుకూ ఆమెలో కొత్తమనిషిని చూశాను నేను. ఆమెలో స్త్రీత్వాన్ని నిద్రలేపాలనే చిలిపి ఆలోచన వచ్చేది నాకు. ఎంతటి గొప్ప స్త్రీ అయినా, పొగడ్తకు బానిస అనుకునే నన్ను సన్నగా నవ్వుతూ శాసించేది ఆమె. సాధారణమైన ఆడదానిలో లేని గొప్పగుణం ఆమెలో వుంది. ఆమె ఏమిటో ఆమెకు తెలుసు. ఆమె మీద నాకున్నది ప్రేమో, జాలో, ఆరాధనో తెలియని అయోమయ స్థితిలో ఉండగా శారద పురిటికి వెళుతూ "అసలే అయోమయ మనిషి హారతి! కాస్త కనిపెట్టి వుండు" అని జాగ్రత్తలు చెప్పి వెళ్ళింది. దానికి కారణం శారదకు జెలసీ లేక కాదు – హారతి మీద నమ్మకం. ఆ విషయంలో శారదకు నమస్కరించ బుద్ధేస్తుంది నాకు. మామూలు జ్వరం టైఫాయిడ్‌గా పరిణామం చెందడానికి మూడురోజుల ముందే హారతికి ఫోన్

చేశాను. జ్వరం...నీరసం! ఈ బాధలో హారతి వస్తుందనే ఆలోచన హాయిగా వుంది. మానసికంగా నేను యిటువంటి అవకాశాలే చాలా రోజులుగా ఎదురుచూస్తున్నానేమోననిపించింది.

హారతి వచ్చింది - కర్పూరంలా, వెన్నెలలా, మలయమారుతంలా.... ఇంకేం రాయను? ...నిస్సహాయంగా పడుకుని, ఆమె సేవలు పొందడంలో వున్న హాయి మామూలు మనిషికి ఎలా అర్థమౌతుంది? డబ్బు, వస్తువులు, ఆస్తులు, హోదాలు....ఇలాంటి చీపిరి ఆలోచనల మధ్య వున్న నాకు తృప్తి, విశృఙ్ఖల సంగీతం, స్పందనలాంటి కొత్త పదాలకు అర్థాలు అవనికలు చీల్చుకుని హారతి రూపంలో సాక్షాత్కరిస్తున్నాయి. ఆ చూపులో తృప్తి, ఆ నిస్వార్థం, ఆ మాటలలో నిజాయితీ... ఆ పదిరోజులూ నా జీవనంలో మర్చిపోలేని మధుర సంగీతాలు ఎన్నో....

కాని, ఆమెలో స్పందన లేదా? ఆలోచించదా? నా కళ్ళలో జీరాడే ఈ ఆరాధన, నా ప్రతి పలుకులో ధ్వనించే ఆహ్వానం ఆమెకు అర్థంకాలేదా? ఏమిటీ మనిషి? స్పందనే లేకపోతే ఈ సేవాతత్వం ఎక్కడిది? ఆ నిర్లిప్తత ఏమిటి?

ఆ మాటే అడిగాను. నా గొంతులోని నీరసం ఆమెనునిద్రలేపిందేమో అలవాటు చొప్పున మాట మార్చనీయలేదు.

"నాకు అర్థంకావటంలేదని ఎందుకనుకుంటున్నారు? నా జీవితం చాలా నేర్పించింది మూర్తిగారూ! ఇంత చక్కటి తీయని అనుభూతులు మళ్ళీ ఉండవు. మనిషి ప్రవర్తన పరిస్థితులకు ఎప్పుడూ కట్టుబడాలి. అందుకే అశాశ్వతమైన ప్రపంచంలో ప్రతిక్షణం శాశ్వతం కావాలనుకోవడం పిచ్చితనం. ఈ క్షణంలోని భావాలు, రేపు మళ్ళీ మనకుండవు. అల్లాంటప్పుడు అవి కోరికలతో మలినమై చూడండీ గాయాల్లా జ్ఞాపకానికి రాకూడదు. మెల్లిగా కూర్చోబెట్టి బత్తాయి రసమిస్తూ నా చూపుల్తో తన చూపులు కలవకుండా చెప్పింది హారతి. ఆలోచిస్తూ కళ్ళు మూసుకుని పడుకున్నాను ప్రతి మాట వెనకాలా తెలియని ధ్వని...ఇదే జీవితంలో ఏదో తెలియని మధురమైన , అనుభూతి రక్తనాళాల్లో చిమ్మి ఆనందంతో ఊపిరాడనీయటం లేదు. దీని ఫలితమేమిటి? ఫలితమంటూ ఎందుకు ఆలోచించాలి? హారతి చెప్పినట్లు ఆ క్షణంలో నాకు వెయ్యి భగవద్గీతలు లక్ష లాక్షణిక క్షణిక గ్రంథాలు అర్థమైతున్నాయి.

ఆ మిగిలిన కొద్ది రోజుల్లోనూ మా ఇద్దరి మధ్య ఎన్నో చర్చలు, ఎంతో చదివింది హారతి. నాలో సైంటిస్ట్‌కుండే మూర్ఖత్వాన్ని తొలగించింది. తత్వవేత్తను చేసింది. ఆలోచనలకు పరిమళమద్దింది. నాలో తెలియని జ్ఞానం వెలిగించింది. ఎంత ఒద్దనుకున్నా ఆరోగ్యం చిక్కింది నాకు.

మాట్లాడుతూండగానే ఒక మధ్యాహ్నం మటుమాయమైంది హారతి. అలా అర్థంతరంగా వెళ్ళిపోతుందని నా మనస్సెందుకో చెప్తూనే ఉంది నాకు. కర్తవ్యమైన మరుక్షణం నా దగ్గర ఉండదు నాకు తెలుసు.

ఆ తరవాత వాళ్ళ అన్నయ్య దగ్గరకు స్టేట్స్‌కు వెళ్ళిపోయింది హారతి.

మరొకసారి కనబడింది. మామూలుగా మాట్లాడింది. ఎందుకు వెళ్ళిపోయింది! నా కోసమే అని గర్వపడటానికి హారతి విషయంలో అంగీకరించడం లేదు. ఈ అనుభూతి ఎంత ఉన్నతమైనదంటే, ఇది నాలో అహంకారాన్ని కూడా అది చంపేసింది. ఆ తరవాత హారతి ఇన్స్పిరేషన్‌తో చదివాను. ఎన్నో బహుమతులు, మెడల్స్ పొందాను. ప్రతిదానికి వెనకలా చెప్పుకోలేని తీయని అనుభూతి. కంగ్రాట్యులేషన్స్ లెటర్స్ మాత్రం వచ్చేవి.

"హారతి మళ్ళీ పెళ్ళి చేసుకోకూడదూ?" అని ఎవరో అడిగారు శారదను.


"హారతికి పెళ్ళా! దానిలా ఆలోచించే మొగవాడేలేడేమో, అది నిప్పు.... దాన్ని భరించడం కష్టమే..." అంటోంది శారద.

అమాయకంగా చెప్పినా నిజం చెప్పింది శారద.

నిజం! హారతి ఒక అగ్నిపుష్పం!

*(వనిత మాసపత్రిక - ఆగష్టు, 1980)*

❖❖❖❖❖



## 'పిల్లలరాజ్యం' కథలపుస్తకం పై గౌరవనీయులు ఉపరాష్ట్రపతి శ్రీ వెంకయ్యనాయుడుగారి సందేశం

भारत के उपराष्ट्रपति
VICE-PRESIDENT OF INDIA

శ్రీ పెయ్యేటి రంగారావు గారికి,

మీరు పంపిన కీ.శే. పెయ్యేటి శ్రీదేవి గారి 'పిల్లల రాజ్యం' కథల పుస్తకాన్ని పరిశీలించాను. ఎంతో ఆనందం కలిగింది. కుటుంబ సంబంధ బాంధవ్యాలకు సంబంధించిన కథలతో రూపొందిన ఈ పుస్తకంలోని ప్రతి కథా వినోదాత్మక శైలిలో ఆలోచింపజేసే విధంగా సాగింది.


ఉమ్మడి కుటుంబ వ్యవస్థలోని పవిత్ర రాగానుబంధాలను, అవకాశవాదుల మూర్ఖత్వానికి బలైపోతున్న కుటుంబాల వ్యథలను, కుటుంబంలో ఎదురయ్యే వివిధ సమస్యల ఆవేదనా పూర్వక సందర్భాలను ఎంతో చక్కగా ఈ పుస్తకంలో శ్రీమతి శ్రీదేవి గారు రాసిన తీరు ఆకట్టుకునే విధంగా ఉంది.

మంచి పుస్తకాన్ని పంపించిన మీకు అభినందనలు తెలియజేస్తూ, ఇటీవల పరమపదించిన శ్రీమతి పెయ్యేటి శ్రీదేవి గారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను.

(ముప్పవరపు వెంకయ్యనాయుడు)

న్యూఢిల్లీ,

అక్టోబర్ 2021.



# స్వేచ్ఛాభారతి వజ్రోత్సవం

శ్రీమతి విజయ గొల్లపూడి, సిడ్నీ



భారతదేశానికి డెబ్బై ఐదవ స్వాతంత్ర్య దినోత్సవం వచ్చిందోయ్ వచ్చిందోయ్
అలనాడు అమావాస్య చీకటులను చీల్చుకుంటూ  స్వేచ్ఛా అధికారాలను తెచ్చిందోయ్ తెచ్చిందోయ్
బానిసత్వాన్ని, దాస్య శృంఖలాలను త్రెంచివేసిందోయ్
ఎల్లెడల ఆకాశాన్ని తాకే సంబరాలు ఇంటింటా వెల్లివిరిసెనోయ్
భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజుఎందరెందరో వీరుల త్యాగఫలమోయ్
జాతిపిత గాంధీ జాతికి చూపిన సత్యం, అహింస ఆదర్శమార్గాలోయ్
ప్రజలే పాలకులుగా, ప్రజలకోసం ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడెనోయ్
స్వాతంత్ర్య ఆగమనం యువతకు భవితవ్యాన్ని, బాధ్యతను గుర్తు చేసెనోయ్
దేశం నాకేమిచ్చింది, దేశంవల్ల నాకేమి లాభం.  అనే స్వార్ధ చింతన మానవోయ్
దేశ పౌరునిగా, కర్తవ్యదీక్ష చేపట్టి లక్ష్యసాధనతో గమ్యాన్ని చేరుకోవోయ్
చట్టాలు, శిక్షలు, నిబంధనలు ఉంటేనే విధులు, ధర్మనిర్వహణ కాదోయ్
స్వయంనిర్దేశక సూత్రాలు ఆదేశించుకుని, విచక్షణ, నిబద్ధత కలిగి మెలగవోయ్
స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఉన్నంతనే విచ్చలవిడితనం, పట్టపగ్గాలు లేక హద్దు మీరకోయ్
రాష్ట్రానికి, దేశానికి సరిహద్దు ఉన్నటులనే, మనిషిగా నీ సరిహద్దుగిరిని గీసుకోవోయ్
వచ్చిన అవకాశములను అందుకుని ఆకాశమేహద్దుగా ప్రగతిపథంలోకి దూసుకుపోవోయ్
డెబ్బై ఐదు వత్సరాలలో  స్వాతంత్ర్య స్వేచ్ఛా ఫలాలను ఆనందించటానికి బాటవచ్చెనోయ్
దేశప్రగతికి పాటుపడిన నవభారత నిర్మాతల జీవనశైలిని గమనించవోయ్
విలాతిని వీడి, పరాయిగడ్డపై అడుగిడినా, మాతృభూమిని, నీ మూలాలను నీవెన్నడు మరువకోయ్
ప్రపంచీకరణ తప్పదనిన, నీలోని జ్ఞానార్తిని తీర్చుకొనుటకు, దేశాటన కావించవోయ్
భారతమాత ముద్దుబిడ్డగా, నీ ఉనికిని చాటుతూ ఘనకీర్తి పతాకాన్ని ఎగురవేయవోయ్
అఖండ భారతదేశ సంస్కృతి, సనాతనధర్మ దివిటీ వెలుగులో అలరారుతూ
భారతమాత కి జై! అంటూ గొంతెత్తి కీర్తించవోయ్!

❖❖❖❖❖

# జీవనయానం

శ్రీ పెయ్యేటి రంగారావు, హైదరాబాద్

అపరిచితులేమిటి, పరిచితులేమిటి,
స్నేహితులేమిటి, ఆప్తులేమిటి,
ఆత్మబంధువులేమిటి, రక్తసంబంధీకులేమిటి,
అర్ధభాగమేమిటి.........., అందరూ
నేనెక్కిన ఓడలో, నేను కూర్చున్న బోగీలో,
నా సీటుకి చుట్టుపక్కల కూర్చుని,
కొద్ది ఘడియలు, కొద్ది రోజులు,
కొద్ది నెలలు, కొద్ది సంవత్సరాలు,
కొద్ది దశాబ్దాలు నాతో గడిపి,
నా భావాలను, నా అనుభవాలను తమతో పంచుకొని,
తమ భావాలను, తమ అనుభవాలను నాతో పంచుకొని,
ఉన్నట్లుండి అకస్మాత్తుగా,
ఏ విధమైన ముందు హెచ్చరికలు లేకుండా
దిగ్గున లేచి, నన్ను వదలి వెళిపోతారు.
అయినా నా ప్రయాణం అలా సాగుతూనే వుంటుంది.
వెడలిన వారు వెడలిపోగా, మిగిలి వున్న వారితో
నా జీవనయాత్ర సాగుతూ వుంటుంది.
అలా నన్ను వదలి
అకస్మాత్తుగా వెడలిపోయిన వారి వల్ల
నాకు బాధ కలుగుతుంది,
వేదన కలుగుతుంది.
వారిని తప్పు పట్టడం కూడా జరుగుతుంది.
ఇలా అర్ధంతరంగా వెడలిపోతారా అని
నవరసాల్లోని కొన్ని రసాలు నా మనసుని
ఉత్తేజపరుస్తాయి, క్రుంగదీస్తాయి.
కాని అప్పుడు నేను గ్రహించుకోను.
నేను ఒకరివైపు వేలెత్తి చూపుతున్నానంటే,
మిగిలిన వేళ్ళు నావైపు తిరిగి వున్నాయని.
అలా కొన్ని సంవత్సరాలు నేను కూడా
మరి కొందరికి నా సాహచర్యాన్ని ప్రసాదించి,
ఉన్నట్లుండి హఠాత్తుగా............
ఎవరు పిలిచారో తెలియకుండా,
ఎక్కడకు వెడుతున్నానో తెలియకుండా,

గమ్యమేదో గ్రహించకుండా.... దిగ్గున లేచి,
నా చుట్టూ వున్న వారిని లక్ష్యపెట్టకుండా,
వారు నాకు పంచి ఇచ్చిన ఆత్మీయతానురాగాలను
ఏమాత్రం పరిగణించకుండా నిష్క్రమిస్తాను.
అప్పుడు నా చుట్టూ వున్నవారు
గతంలో నేను బాధ పడినట్లుగానే బాధ పడతారు.
కాని కొద్ది రోజులకి.........
కాలవాహిని తీరాన ముద్రితమైన నా అడుగుజాడలు,
ఒక్క కెరటపు తాకిడితో చెరిగిపోతాయి.
అప్పుడు నేను .........., నా జ్ఞాపకాలు........,
నా చరిత్ర సమస్తం..............
ఈ అనంత కాలవాహినిలో లుప్తమైపోతుంది.
కాని కాలచక్రం మాత్రం ఆగదు.
అది గిర్రున నిరంతరం తిరుగుతూనే వుంటుంది.

❖❖❖❖❖

ACHIY HOMES
Your Happiness is Our Satisfaction BL No. 323075C
HIA 0431081640
www.achiyhomes.com.au Email: info@achiyhomes.com.au

Custom Built Homes
Dual Occupancy/Duplex
House & Granny Flat
Granny Flat
Knock Down & Re-Build

❖❖❖❖❖

# శతవసంతాల సుస్వరం-శ్రీ సుసర్ల దక్షిణామూర్తి



అనేక భాషల్లో 135 సినిమాలకు సంగీత దర్శకత్వం వహించిన సంగీత సామ్రాట్ సుసర్ల దక్షిణామూర్తిగారు. వీరి పూర్తి పేరు సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రి. సుసర్ల దక్షిణా మూర్తి గారు జన్మించింది. నవంబర్ 11, 1921. వీరి తలిదండ్రులు అన్నపూర్ణ, కృష్ణబ్రహ్మ శాస్త్రి లు. వీరు కృష్ణజిల్లా దివిసీమలో దక్షిణకాశీగా ప్రసిద్ధికెక్కిన పెదకళ్ళేపల్లి గ్రామంలో జన్మించారు. వీరి తాతగారి పేరే ఈయనకూ పెట్టారు. దక్షిణామూర్తి తాత స్వయాన త్యాగయ్య శిష్యుడైన మానాంబుచావడి (ఆకుమళ్ళ) వెంకటసుబ్బయ్యకు శిష్యుడు. ఈయన తండ్రిగారి దగ్గరే సంగీతం నేర్చుకున్నారు. గాత్రం, వయోలిన్ నేర్చుకున్నారు. ఐతే, పాఠశాల విద్యాభ్యాసం ఆరోతరగతితోనో, ఏడో తరగతి తోనో ముగిసింది. పదమూడు సంవత్సరాల ప్రాయంలోనే గాత్రంతో, వయోలిన్ తో అనేక రాజాస్థానాలోల కచేరీలు ఇచ్చేరట. పదహారో ఏట గజారోహణ జరిగిందిట. విజయవాడలో తిరుపతి వేంకట కవులు సుసర్ల వారి గాత్రకచేరి విని ఎంతో మెచ్చుకొని వారిపై పద్యం ఆశువుగా చెప్పేరట. వారు వయొలినే కాకుండా హార్మోనియం, అరుదుగా వేణువు కూడా వాయించేవారు'

'నారద నారది' చిత్రానికి తొలిసారిగా సంగీత దర్శకత్వం వహించిన దక్షణామూర్తి గారు సంసారం చిత్రంతో ప్రాచుర్యం పొందారు. లతామంగేష్కర్‌తో తొలిసారి తెలుగులో పాడించిన ఘనత ఈయనకే దక్కుతుంది.సంతానం చిత్రం కోసం లతా మంగేష్కర్ గారితో 'నిదురపోరా తమ్ముడా...' అనే పాటను పాడించారు. దాసి, అన్నపూర్ణ, నర్తనశాల, శ్రీమద్విరాట్ పర్వం, శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర ఇలా పలు చిత్రాలకు సంగీతం అందించారు.సంగీత దర్శకులు ఎస్.పి. కోదండపాణి, ఏ.ఏ. రాజ్, శ్యామ్ మొదలైనవారు వీరిదగ్గర పనిచేసారు. ఇంకా ప్రసిద్ధ సంగీత దర్శకుడు ఎం. ఎస్. విశ్వనాథన్ కూడా సుసర్ల వద్ద హార్మోనిస్టుగా పనిచేశారు.సంగీత దర్శకుడిగా సుసర్ల ప్రధానంగా హార్మోనియమ్ మీదే బాణీలు కట్టేవారు. జమునా రాణి, పి. లీల, బెంగుళూరు లత మొదలైన గాయనీమణులకు మొదటగా అవకాశం ఇచ్చి, పరిచయం చేసారు సుసర్ల. 'సంతానం' (1955) లో లతా మంగేష్కర్‌నూ, 'ఇలవేలుపు' (1956) లో రఘునాథ్ పాణిగ్రాహినీ, 'వచ్చిన కోడలు నచ్చింది' (1959) ఎం.ఎల్. వసంత కుమారి, 'నర్తనశాల' (1963)తో మంగళంపల్లి బాలమురళీకృష్ణ ఇలా ఎంతోమంది గాయకులను సుసర్ల దక్షిణామూర్తి తెలుగు చిత్ర రంగానికి పరిచయం చేశారు. 'నారద నారది'లో చిన్నవేషం, రాజ్యం పిక్చర్స్ 'హరిశ్చంద్ర' చిత్రంలో కాశీ రాజు వేషం వేశారు.ఆంధ్ర రాష్ట్ర అవతరణ సందర్భంగా ప్రార్థనా గీతం పాడి జవహర్‌లాల్ నెహ్రూ చేతులమీదగా సన్మానం అందుకున్నారు. వివిధ ప్రైవేటు సాంస్కృతిక, కళా సంస్థలు ఎన్నో సన్మానాలు, సత్కారాలు చేశాయి. బిరుదులు ప్రదానం చేశాయి. 'స్వరశిల్పి', 'సంగీత కళాప్రపూర్ణ', 'సుస్వరాల సుసర్ల', 'స్వరబ్రహ్మ', 'సంగీత కళానిధి', 'సంగీత సమ్రాట్', ఎన్టీఆర్ పేర్కొన్న 'స్వర సుధానిధి' లాంటి బిరుదులు సుసర్లకు దక్కాయి. విదేశాలలో కూడా కచ్చేరీలు చేసి, తమ సంగీత వైభవాన్ని సుసర్ల చాటుకున్నారు. ఈ అపర స్వరబ్రహ్మకు తెలుగువాహిని స్వరనీరాజనాలు సమర్పిస్తోంది.

❖❖❖❖❖


Adyar Ananda Bhavan
SWEETS & SNACKS
AAB
SYDNEY
A2B
VEG. RESTAURANT
Adyar Ananda Bhavan
OUR DELICIOUS FOOD AT YOUR CITY
Vegetarian Restaurant
Multi Cusine
Adyar Ananda Bhavan brings you exciting vegetarian food, making us a perfect place for dining with family or just a quick bite on the go. Food at our pure vegetarian restaurant is made using the fresh ingredients ensuring that we serve the healthiest food. For serving superior quality food at fair prices, Adyar Ananda Bhavan is reckoned among the best veg restaurants in Chennai and all over India and abroad.
Call Us At
(+02) 9633 2767
ORDER NOW
116 Wigram St
Harris Park
www.a2bsydney.com.au

❖❖❖❖❖


AMARAVATHI
DINE IN • RESTAURANT
Opening Hours
Mon-Sun: 11:00 am – 10:30 pm
Contact Details
AMARAVATHI Harris Park
42 Marion Street, Harris Park NSW 2150
02 8606 2279
AMARAVATHI Wentworthville
Shop 3 / 1-5 Dunmore Street, Wentworthville NSW 2145
02 8606 3333

❖❖❖❖❖

# మహా సభలూ- ఆహ్వానిత అతిధి భాగోతాలూ

--వంగూరి చిట్టెన్ రాజు, హ్యూస్టన్, టెక్సస్

అనగనగా ఒక రాజు...ఆ రాజు స్వ.ప్ర.సా.వే గా అమెరికాలో తెలుగు సాహిత్యానికి ఆముదపు చెట్టుగా చెలామణీ అవుతున్నాడు కాబట్టి కొన్నేళ్ళ క్రితం ఒకానొక దేశవాళీ మహా సభలలో  సాహిత్యం కమిటీకి "కుర్చీ మగాడు" ..అంటే ఛైర్ పెర్సన్ పదవికి 'ఏక గ్రీవంగా' ఎంపిక అయ్యాడు. ఇక చూసుకోండి. ఆ దిక్కు మాలిన రాజు ....సరే...ఎవరో ఏమిటి లెండి....ఆ దిక్కుమాలిన అనబడే నేను నాలుగు రోజులు కాలర్ ఎగరేసుకుని ఇంటా, బయటా తిరుగుతూ ఉంటే మా క్వీన్ విక్టోరియా ఇక ఉండబట్ట లేక "అదేదో పెద్ద ఏక గ్రీవం, హయగ్రీవం అని గొప్పలు పోకు. అదేమీ కాదు. వాళ్లకి ఇంకెవరూ దొరక్క నీకు తగిలించారు. కాస్త పొగడగానే నువ్వు హనుమంతుడి టైపులో ఉబ్బి పోయి, తోక జాడించుకుంటూ ఒప్పేసుకున్నావు. వాళ్ళకి చాకిరీకి ఎవరో ఒకరు కావాలిగా అదీ. రహస్యం" అని లోగుట్టు బయట పెట్టింది. ఏదైతేనేం, సాహిత్యం పిల్లికి మరో సారి గంట కట్టే అవకాశం వచ్చింది కదా అని నేను బతిమాలి, వాళ్ళ పిల్లలకి బిళ్ళలూ, పెళ్ళాలకి చాక్లెట్లూ ఇచ్చి నాకు తెలిసిన మరో ఇద్దరు, ముగ్గురు రచయితలని సాహిత్య "నిర్వాక" సంఘం లో సభ్యులుగా వేసుకున్నాను.

భలే వారే. నేనేం తప్పు మాట వ్రాయ లేదు. మీరు చదివినది కరెక్టే. నిఘంగానే అది సాహిత్య "నిర్వాక" సంఘమే. ఎందుకంటే మేము సరిగ్గా పని చేస్తామో, లేదో అని మా మీద నిఘా వెయ్యడానికి మహా సభల నిర్వాహక సంఘం వారికి గూర్ఖా సంఘం అయిన జాతీయ సలహాదారుల సంఘంలో ఒకాయన్ని మాకు సలహా దారుడిగా నియమించారు. అనగా ఆయన ఉద్యోగం ఏమిటంటే అన్ని విషయాలలోనూ తమ అగ్రకుల మర్దన సరిగ్గా జరుగుతోందో లేదో అని కాపలా కాసే బహు దొడ్డ మనిషి అనమాట. సమస్య అల్లా ఈ బహు దొడ్డ మనిషికి ఈ  "నిర్వాహక" అనే మాట నోట తిరిగేది కాదు. ఎంత ప్రయత్నించినా ఎన్టీఆర్ గారి అగ్నానం లాగా ఎప్పుడు మాట్లాడినా నిర్వాక అనే నోటమ్మట వచ్చేది. అంచేత పదే, పదే నిర్వాక అనేసి నాలిక కరుచుకో లేక  ఎందుకొచ్చిన తెలుగు అని ఆర్గనైజింగ్ కమిటీ అనో లిటరరీ కమిటీ అనడం మొదలు పెట్టాడు.  పాపం, పాతిక వేల డాలర్లు విరాళం ఇచ్చి ఆ పదవి కొనుక్కున్న ఆయన్ని అంత కష్ట పెట్టడం ఎందుకులే, మనమే సద్దుకు పోదాం అని మా కమిటీ పేరు సాహిత్య "నిర్వాక" సంఘంగా మార్చేశాం. పైగా మేము చేసేది నిర్వహణ తక్కువా, నిర్వాకం ఎక్కువా కాబట్టి మా నిజాయితీ ఆ విధంగా నిరూపించుకున్నాం కదా!

ఇక  మేం అందరం కూచుని ఈ మహా సభలలో సాహితీ వేదికని అన్ని మహా సభలలో లాగానే "చరిత్రలో ఎన్నడూ జరగని విధంగా" ఎలా నిర్వహించాలా అని తర్జన భర్జన పడుతూ ఉండగా "మీ బడ్జెట్ ఎంతా?" అని మా మహా సభల కన్వీనర్ గారు అడిగారు. మహా సభలు కదా,  మహా గొప్పగా చేసేద్దాం అనుకుని మేము ఆహ్వానిత అతిధుల పట్టిక తయారు చేశాం. ముందుగా సమయానికి "మందూ, మాకూ" అందివ్వడానికి భార్యా సహితంగా బాగా పేరున్న ఒక సినీ రచయితనీ, ఇక్ష్వాకుల కాలంలో ఒకే ఒక్క సినిమా పాట వ్రాసి ఇంకా ఆ మత్తులోనే ఉండి  గొప్ప సినీ గేయ రచయితగా ప్రచారం చేసుకుంటున్న మరొక నిరుద్యోగ రచయిత గారిని వెరైటీ గా  భార్యా రహితంగానూ ఎంపిక చేశాం. 'భార్యా రహితం' అంటే ఆయనకి భార్య లేదు అనీ, ఉన్నా ఆయనతో ఎక్కడికీ రాదూ అని అర్థం కాదు. "మహా సభల వారు మా ఇద్దరికీ టిక్కెట్టు పెట్టుకుంటాం అని ఆహ్వానంలో ఉత్తుత్తునే వ్రాస్తే చాలు. మా ఆవిడ టిక్కెట్టు మీరే కొన్నారు అని ఆవిడకి చెప్పి ఆవిడ టిక్కెట్టు నేనే రహస్యంగా కొనుక్కుంటాను" అని ఆయన మాకు లోపాయికారీగా కబురు పంపించారు. అదీ సంగతి. ముందుగా వీళ్ళనే ఎందుకు ఎంపిక చెయ్య వలసి వచ్చిందీ అంటే... సినీ వాసన ఉన్న ఫోటోలు ఉంటే తప్ప మహా సభల ప్రచారం ప్రకటనల్లో అసలు తెలుగు సాహిత్యం గురించి ప్రస్తావించరు కదా! ఉదాహరణకి ఏ గురజాడ వారి ఫోటోయో వేస్తే "ఎవడీ తలపాగా వాడు?" అని చికాకు పడి జనాలు రిజిస్ట్రేషన్ చేసుకోరు కదా! లెక్కలు వేస్తే ఇండియా నుంచి వచ్చే ఈ మూడు తలకాయలకి..అదే లెండి, ఇద్దరు మొగుళ్ళు, ఒక భార్య లకి తలా ఒక్కొక్కరికీ వీసా, ప్రయాణం, స్థానిక హోటల్ ఖర్చులూ కలిసి $3,000 చొప్పున తొమ్మిది వేల డాలర్లు బడ్జెట్ అయింది. ఇక అమెరికాలో ఇతర నగరాల నుంచి ఐదుగురు స్వ.ప్రా.సా.వే లని లాటరీ పద్ధతిలో  ఎంపిక చేశాం.

ఇక ఈ ఐదుగురు అమెరికా ఆహ్వానిత రచయితలకీ విమానం, ఇతర ఖర్చులూ కలిసి మరొక ఐదారు వేలు కలిసి మొత్తం $15,000 బడ్జెట్ కన్వీనర్ గారికి సమర్పించాం. అమెరికా సాహితీవేత్తలు లాటరీ పద్ధతిలో ఎంపిక చేయబడుదురు. అంటే మొత్తం మహా సభల బడ్జెట్ అయిన 2 మిలియన్ డాలర్లలో ఒక శాతం కంటే తక్కువ... మన తెలుగు రాష్ట్రాలలో సాహిత్యానికి కేవలం 0.1 శాతమే కాబట్టి మనం అంత కంటే బెటరే కదా!

ఇక్కడో చిన్న రామాయణంలో పిడకల వేట.....అమెరికా సాహితీవేత్తల ఎంపికలో అసలు లాటరీ నిజంగా వేసినా, వెయ్యకపోయినా అందరికీ "లాటరీ పద్ధతి లో ఎంపిక అయిన ప్రముఖ స్వ.ప్ర.సా.వేలు" అని తెలుగు వార్తా పత్రికల శీర్షిక టైపు లో చెప్పడానికి ఒక ముఖ్య కారణం ఉంది. మా సాహిత్యం కమిటీ అందరం కలిసి అన్నీ పరిశీలించి, ఎంత నిష్పక్షపాతంగా ఏ అమెరికా రచయితని ఎంపిక చేసినా చేస్తే "కుర్చీ మనిషి" గా నా కొంప కొల్లేరే. ఆ రచయితకీ నాకూ ఉన్న కుల, బంధు, స్నేహ బాంధవ్యాలే ఆ ఎంపికకి కారణాలు అనీ, ఇదంతా పైరవీ బాపతు అనీ ఫేస్ బుక్ లో పోస్ట్ లు గేరంటీ. ఇలాంటి వాటిల్లో ఒక సారి రంధ్రాన్వేషణ మొదలయితే ఇక అంతే సంగతులు. పైగా ఎవరిని ఎంపిక చెయ్యాలా అని ఎంత రహస్యంగా మీటింగులు పెట్టుకున్నా, అవి కూడా ఈ అతి చిన్న సెల్ ఫోన్లలో రికార్డ్ చేసి అందులో ఏదైనా "కారాలు, మిరియాలు" ఉంటే మళ్ళీ ఫేస్ బుక్ అంతా బిజీ. నేను విన్నది ఏమిటంటే...ఒక సారి మరొక మహాసభ వారి సాహిత్యం కమిటీ అంతరంగిక సమావేశంలో ఎవరో..అవును నన్నే... ఆహ్వానిస్తే బావుంటుంది అని సూచిస్తే ఆ కమిటీ అధ్యక్షుల వారు "ఆ దిక్కుమాలిన రాజుని తప్ప అమెరికాలో ఇంకెవరైనా పరవా లేదు" అని కోప్పడ్డారుట...ఆ వార్త నా దాకా రానే వచ్చింది. ఏం చేస్తాం. వాళ్ళు పిలవకపోయినా ఆ దిక్కుమాలిన సభలకి వెళ్ళనే వెళ్ళాను. ఎంతయినా తెలుగు సాహిత్యం కదా!

ఇక మా నిర్వాకం కమిటీ వారు "చరిత్రలో ఎన్నడూ జరగని విధంగా" మహా సభల సాహిత్య వేదిక కోసం ప్రతిపాదించిన 15 వేల డాలర్ల బడ్జెట్ మా కన్వీనర్ గారు చూడగానే ఆయన ముందుగా "ఈ స్వ.ప్రా.సా.వే ఎవరూ, ఆయన సినిమా పాటలు రాస్తాడా, పంచ్ డైలాగులా, కథా, పద్మశ్రీ లాంటి బిరుదులు ఏమన్నా కొనుక్కోగలిగారా?" అని అడిగారు. అప్పుడు నేను రహస్యం బయట పెట్ట వలసి వచ్చి, "స్వ.ప్రా.సా.వే అంటే..స్వయం ప్రకటిత సాహితీ వేత్తలు" అన్నాను.

"నాది ఇంగ్లీష్ మీడియం. అదేదో సరిగ్గా చెప్పండి" అన్నాడు కన్వీనర్ గారు.

"అంటే ఏమీ లేదు. ఇది మనలో మన మాట. అమెరికాలో కొంత మంది రచయితలు వ్రాసేది తక్కువ కానీ అందరికీ తాము గొప్ప సాహితీ వేత్తలు అని తెలిసేలా ప్రచారం ఎక్కువ చేసుకుంటారు కాబట్టి వారిని స్వయం ప్రకటిత సాహితీవేత్తలు అని సగౌరవంగా నేను పిలుచుకుంటాను. అంత కంటే ఏం లేదు" అని వివరించాను.

"ఐసీ....మరి మీరు సెలెక్ట్ చేసిన వాళ్ళకి రిజిస్ట్రేషన్ చేసుకుని సభలకి వచ్చే వాళ్ళ అభిమానులు, స్నేహితులు పదేసి మంది ఉంటారా?" అని ఆయన ఆహ్వానిత అతిధి ఖర్చులకి సరిపడా రిజిస్ట్రేషన్లు వస్తాయా అని కాకి లెక్కలు వేసుకుని అడిగాడు.

"గేరంటీ లేదు స్వామీ, సాధారణంగా ఏదైనా ఒక రచయిత మాట్లాడుతూ ఉంటే వాళ్ళ కుటుంబం వాళ్ళు ఇంట్లో భరిస్తున్నాం చాలదా ఆ సభకి రారు." అని మా సాహితీ కుటుంబంలో ఉన్న మరొక రహస్య సాంప్రదాయం బయట పెట్టాను. "మరి అయితే అంత మంది ఎందుకు? జస్ట్ వన్...ఒక్క అమెరికా రచయితని పిలవండి చాలు. ఆయనొక్కడికీ మనం నమోదు రుసుము ,,అంటే రిజిస్ట్రేషన్ డబ్బు, హోటల్ ఖర్చు, విమానం ఖర్చులకీ వెయ్యి డాలర్లు అయిపోద్ది. చుట్టు పక్కల ఊళ్ళ నుంచి కారులో డ్రైవింగ్ చేసుకొచ్చే స్వ.ప్రా....వాటెవర్..అలాంటి ఆయన్నిసెలెక్ట్ చేసి " బడ్జెట్ $500 పెట్టుకోండి" అని మేము వేసిన అమెరికా రచయితల బడ్జెట్ ఐదు వేల డాలర్ల నుంచి ఐదు వందలకి తగ్గించేశారు కన్వీనర్ గారు.

"దట్ ఈజ్ ఎ గుడ్ ఐడియా. మా బామ్మరిది ఫ్రెండ్ తమ్ముడు కవిత్వం రాస్తాడంట. అతను డాలస్ లో ఉంటాడు. అతణ్ణి పిలుద్దారి. ఓ పని అయిపోతాది" అని మా సాహితీ "నిర్వాక" కమిటీ సలహాదారు సలహా ఇచ్చేశారు. ఆ కవి గారి పేరు కన్వీనర్ గారు రాసేసుకుని "గుడ్ ఐడియా" అన్నారు. చెప్పొద్దూ, ఈ మహా సభల పేరు చెప్పుకుని, వాళ్ళ ఖర్చుతో అర డజను అమెరికా రచయితలని ఆహ్వానించేసి కాస్త పేరు తెచ్చుకుందాం అనుకున్న నా ప్రణాళిక ఈ దెబ్బతో కుదేలు అయిపోయింది.

" నెక్స్ట్.. ఇండియా నుంచి ఎవరిని పిలుద్దాం అనుకుంటున్నారు? అని అడిగారు కన్వీనర్ గారు. నేను చింత చచ్చినా పులుపు చావని కారణం చేత మేము ఎంపిక చేసిన ఆ ఇద్దరినీ తెగ పొగిడేసి వాళ్ళ పేర్లు చెప్పాను. ఎంపిక అయిన ఒక భార్యని పొగడడానికి నా దగ్గర సరి అయిన సమాచారం లేదు. కన్వీనర్ గారు తల పంకించి, "మొదటాయన ..అంటే వైఫ్ తో వచ్చే కవి గారు మొన్న రాసిన ఫిల్మ్ ఫ్లాప్ అయింది. రేటింగ్ పడిపోయింది...ఆయనకి ఆరు వేలు వేస్ట్. ఆ డబ్బుకి బ్రహ్మానందాన్ని బతిమాలొచ్చు. భరించడం కష్టం కానీ బెమ్మి గాడొస్తే వెయ్యి టిక్కెట్లు అమ్ముడు పోతాయి."
ఇలా మొత్తానికి రక రకాల బేరాలు ఆడి, రెండు మిలియన్ డాలర్లు ఖర్చుపెడుతూ నిర్వహిస్తున్న ఈ మహా సభలలో తెలుగు సాహిత్య వేదికకి ఎంతో కష్ట పడి $1,500 కేటాయించారు ఘనత వహించిన మహా సభల "నిర్వాక" సంఘం వారు. అనగా 0.1 శాతం...సరిగ్గా మన తెలుగు రాష్ట్రాలలో ప్రభుత్వం వారు సాహిత్యానికి ఇచ్చే దానితో సరిసమానంగా....
ఇదంతా ఇప్పుడు ఎందుకు జ్ఞాపకం వచ్చిందీ అంటే...మొన్న ఒక రోజున ...నేను అనుకోకుండా, అడగకుండా..ఎంతో ఆశ్చర్యం కలిగించేలా నాకు తెలియని ఒకాయన పిలిచి అమెరికాలో జరుగుతున్న ఒకానొక తెలుగు మహా సభలకి గౌరవ అతిధిగా రమ్మని ఆహ్వానించారు. అది వినగానే లాటరీలో జాక్ పాట్ కొట్టేసినంత సంతోషం వేసింది.
ఈ ఆహ్వానం సంగతి వినగానే "అబ్బో, కంగ్రాట్యులేషన్స్. వాళ్ళంతట వాళ్ళే నిన్ను పిలిచారూ అంటే నువ్వు నేను స్వ.ప్ర.సా.వే కాదనమాట" అనేసి..."..."అంతేనా లేక నువ్వు ఎవరిచేతైనా సిఫారస్ చేయించుకున్నావా?" అని కూడా కించిత్తు సందేహంతో అడిగింది మా క్వీన్ విక్టోరియా. అన్నట్టు వాళ్ళు ఆవిడని కూడా పిలిచారో లేదో పిలిచి అడిగితే రాక రాక వచ్చిన ఈ ఏకైక ఆహ్వానమూ వెనక్కి లాగేసుకుంటారేమో? ఇంతకీ ఆ మహారాణీ గారు నాతో ఈ మహా సభలకి వచ్చునో లేదో? వచ్చెను బో, మా రచయితకుల సాంప్రదాయం పాటిస్తూ సాహిత్య వేదిక కి సుదూరంగా ఉన్న నగలు మరియు పట్టు చీరాల దగ్గరో, సినీ తారలతో సెల్ఫీలు దిగుతునో కాలక్షేపం చేయునా?

❖❖❖❖❖



# మై హూం యమధర్మరాజ్!

శ్రీమతి కమల పరచ, కాలిఫోర్నియా, అమెరికా

లేడీస్ క్లబ్ లో చర్చలు మహా జోరుగా నడుస్తున్నాయి. కొత్త సీ. ఓ గారి భార్యగారు వచ్చాక, మెస్ పార్టీలల్లో, లేడీస్ క్లబ్ తరుపు నుంచి కూడ ఓ ప్రోగ్రాం ఉండాలని ప్రతిపాదించారు. అందరమూ ఉత్సాహంగా ఓకే అనేసాము. మొదటి సారి యూ. పి ఆవిడ కావటం తో, ఆవిడ కోరిక మీద చక్కగా టినోపాల్ అడ్వర్టైజ్మెంట్ లో లా మెరిసిపోయే తెల్లటి లక్నో కుర్తీ పైజామాలు వేసుకొని, మేకప్ చేసుకొని మరీ ఖవాలీ పాడాము. పార్టీలో ఆఫీసర్స్ అందరూ తెగ మెచ్చేసుకొని, మా అందరి దగ్గరకూ వచ్చి అభినందించారు. ఆ విజయం ఇచ్చిన ప్రోత్సాహం తో, ఈ సారి పార్టీకి తయారవుతున్నాము. పైగా ఈ సారి బయట నుంచి గెస్ట్ లు కూడా వస్తున్నారు. పార్టీ చాలా పెద్ద ఎత్తున జరగబోతోంది. అందుకని వీర లెవల్లో చర్చలు జరుగుతున్నాయి. భాంగ్ డా, లేదా ఏదైనా గ్రూప్ డాన్స్ ఇలా తలా ఒకటి చెప్పాక, ఆవిడ "ఈ సారి నాటకం వేద్దాము. డాన్స్ ఐతే అందరూ చేయలేరు, నాటకం ఐతే చాలా పాత్రలు ఉండి, ఎక్కువ మందికి అవకాశం ఉంటుంది" అన్నారు. ఇందులో అభ్యంతరం ఏమీ కనిపించక అందరం వాకే అనేసాము. నేను మనసులో నాటకమైతే, ఆ శుద్ధ్ హిందీ నాకు రాదు కాబట్టి తప్పించుకోవచ్చు అమ్మయ్య అనుకున్నాను. అందరూ ఏ నాటకం వేద్దాము అని తర్జనభర్జన పడుతున్నారు. కాసేపు అన్నీ విని ఆవిడ "నేను "నవీన్ సావిత్రి" అని ఒక నాటకం రాసాను. మీకు అభ్యంతరం లేక పోతే అది వేద్దాము అన్నారు. అందరూ చేదు మాత్ర వేసుకున్న మొహం బెట్టారు.

"అది హాస్య నాటిక. అందులో సావిత్రి తల్లీ తండ్రి, అత్తామామలు, ఇలా చాలా పాత్రలున్నాయి. చాలా తమాషాగా ఉంటుంది అని చెప్పాను. మీ కభ్యంతరమైతే వద్దులే" అన్నారు కాస్త కినుకగా.

అమ్మో అభ్యంతరం ఉందని బాసుగారి పెళ్ళానికి చెప్పటమే! ఏమండీలు ఊరుకుంటారా అని మనసులో అనుకుంటూ అందరమూ మొహామొహాలు చూసుకున్నాము.

అందరిలో ముందుగా తేరుకున్న మిసెస్. తండన్ "టీక్ టీక్ హై. ఆప్ జైసే బోలేంగే ఐసేయీ కరేంగే" అంది. చేసేదేమీ లేక వెర్రి మొహాలేసుకొని అందరం బుర్రూపేసాము.

ఇహ పాత్ర ధారుల ఎంపిక మొదలైంది. చిన్నా చితకా అందరి పాత్రలు ఎన్నికైపోయాయి. ఇహ ముఖ్యమైన పాత్రలు 'సావిత్రి ', 'యమధర్మరాజు ' మిగిలారు. ఆవిడ "సావిత్రి గా నేను వేస్తాను"అన్నారు. తప్పదుగా సరే అనేసాము. యమధర్మరాజు గా అంటూ స్లో మోషన్ లో , సస్పెన్స్ మేంటేన్ చేస్తూ అందరినీ పరికించి చూస్తోంది. ఇంతకు ముందు పాత్రలకు ఎన్నికైన వాళ్ళు కులాసాగా మా వైపు చూస్తున్నారు. మిగితా వాళ్ళు టెన్షన్ గా ఉన్నా నేను మాత్రం ధిలాసాగా ఉన్నాను. ఆవిడ తల ఒక్కొక్కళ్ళ వైపు తిప్పుతోంది.

పిన్ డ్రాప్ సైలెన్స్. ఆవిడ చూపు తప్పుకోగానే చిన్నగా ఉఫ్ అని నిట్టూర్చేవాళ్ళ గాలి సవ్వడి కూడా వినిపించటం లేదు. ఇంతలో చిన్నగా కాదు కాదు ఢభేల్ మని నా నెత్తిన ఏదో పిడుగు పడ్డ శబ్దం వినిపించింది! నా వైపు చూస్తూ "ఆప్ కరేంగే యమధర్మరాజ్ " అని ఏదో అన్నట్లుగా లీలగా వినిపించింది. నేను. . . నేను యమధర్మరాజునా సన్నగా, పెద్ద గాలేస్తే పడిపోయేట్లున్న నేను యమధర్మరాజును, లావుగా పొట్టిగా ఉన్న ఆవిడ సావిత్రి. విధి లీల, భగవంతుని చిత్రాలు ఏవేవో గుర్తొచ్చేస్తున్నాయి. అవును మరి నవీన్ సావిత్రి కదా! అలాగే ఉంటారేమో!

ఆవిడ వైపు అయోమయంగా చూస్తూ "నాకు స్టేజ్ ఎక్కాలంటే భయం" అన్నాను నంగిరి నంగిరిగా.

"భయమెందుకు? ఐనా వెల్ఫేర్ సెంటర్ ప్రోగ్రాం లు కండక్ట్ చేస్తావు కదా" అన్నది.

"అక్కడ అంతా ఆడవాళ్ళు, ఓ పది మందే ఉంటారు." అన్నాను చిన్నగా.

"మొన్న ఖవాలీ లో ఉన్నావుగా?" అంది.

ఏదో గుంపులో గోవిందమ్మలాగా అటో చప్పట్లు, ఇటో చప్పట్లు కొట్టానే కాని నేను చేసింది ఏముంది దానికీ ఆ తరువాత ఏమండీగారు,"చప్పట్లు కొట్టటానికి కూడా అంత భయమెందుకు ?" అని ఎంత క్లాస్ పీకారో! అని ఆమెవైపు గుడ్లప్పగించి చూస్తూ, చివరాఖరురుగా "మేరేకో హిందీ టీక్ సే నై ఆతా" అన్నాను హైదరాబాదీ స్టైల్ లో.

"కోయీ బాత్ నై. ఆప్ కో జాదా డైలాగ్స్ నహీ రహతా. నేను నిన్ను "ఆప్ కౌన్ హో "అని అడుగుతాను. మై హూ యమధర్మరాజ్ అని, మీసం మేలేస్తూ, గంభీరంగా చెప్పాలి. మధ్య మధ్య సావిత్రీ అని భీకరంగా అరవాలి. అంతే" అందావిడ సింపుల్ గా.

గంభీరంగా, భీకరంగా నా? నా బొంద నలుగురి ముందు గొంతే పెగలదు. చచ్చేంత టెన్షన్. అట్లా అని ఈవిడ కు ఏమీ చెప్పలేని మొహమాటం. అంతే అంటుంది కాని అది ఎంతో ఆమెకేమి తెలుసు. ఈ మొహమాట మోక్షం తో ఏమి చేయాలో తోచక చుట్టూ అందరి వైపు చూసాను. అందరూ ఏమి మాట్లాడితే ఏమో, ఎక్కడ ఈ యమధర్మరాజు పాశం వాళ్ళ మెడకు చుట్టుకుంటుందో అని నిశ్శబ్దంగా మా ఇద్దరినీ కళ్ళప్పగించి చూస్తున్నారు. మనసులో బాగైందిలే లల్ల లల్లా అని పాడుకుంటూ నవ్వుకుంటున్నారేమో కూడా అని ఓ డౌటనుమానం వచ్చింది.

"రేపు ఆదివారం కదా ఎళ్ళుండి నుంచి రిహార్సల్ మొదలు పెడుదాము. వారంరోజులే ఉంది టైం" అని అదే ఫైనల్ అన్నట్లు చెప్పి లేచింది. నా వైపు జాలిగా చూస్తున్న ఎవరినీ పట్టించుకోకుండా నీరసంగా నేనూ ఇంటికి బయలు దేరాను.

డైనింగ్ టేబుల్ మీద గిన్నెలు సద్దుతున్న నన్ను "ఎట్లా ఐంది మీ లేడీస్ మీట్? ఈ సారి ఏమైనా ప్రోగ్రాం చేస్తున్నారా ?" అని అడిగారు ఏమండి. నేను ఏమీ మాట్లాడలేదు. పరధ్యానంగా, నీరసంగా ఉన్న నన్ను చూసి "ఏమైంది?అట్లా ఉన్నావు" అన్నారు.

"ఏమీ లేదు. ఈ సారి "నవీన్ సావిత్రి" అని నాటకం వేస్తున్నాము." అన్నాను ముభావంగా.

"వెరీ గుడ్. నువ్వేమైనా వేషం వేస్తున్నావా?" అని అడిగారు.

అప్రయత్నంగా "మై హూం యమధర్మరాజ్" అన్నాను.

నోట్లో పెట్టుకోబోతున్న ముద్దను ఆపి "ఏమిటి?" అన్నారు.

"అవును. నేను యమధర్మరాజ్ వేషం వేస్తున్నాను"అన్నాను. ఏమండి నావైపు విచిత్రంగా చూస్తూ "మరి సావిత్రి ఎవరు?" అడిగారు.

"ఇంకెవరూ మీ బాస్ పెళ్ళాం" అన్నాను కసిగా.

ఏమండీ చేతిలోని ముద్ద జారిపోయింది. ఒక్క క్షణం బిత్తరపోయి, అప్పటి వరకూ మా ఇద్దరి సంభాషణను కుతూహలంగా వింటున్న పిల్లల వైపు చూస్తూ "మీ అమ్మ యమధర్మరాజు" ఆహాహా ఓహోహో అంటూ తలపైకెత్తి నవ్వారు పెద్దగా. పిల్లలూ శృతి కలిపారు. ఆ ముగ్గురి నవ్వునూ చూస్తూ ఉక్రోషంగా అక్కడ నుంచి లేచి వెళ్ళిపోయాను.

రాత్రి తెల్లవార్లూ కలలో యమధర్మరాజు దున్నపోతెక్కి వచ్చి" మై హూం యమధర్మరాజ్ " అని భీకరంగా అరుస్తున్నాడు. పొద్దున నిద్ర లేచి పని చేసుకుంటున్నా, కూడా వెనకెనకే దున్నపోతుమీద తిరుగుతున్నాడు. ఆ యముడి బాధ భరించలేక, అన్యధా శరణం నాస్తి అని సాయంకాలం ఏమండీగారిని, ఈ యమధర్మరాజ్ బారి నుంచి నన్ను రక్షించండి అని వేడుకున్నాను. శ్రీకృష్ణపరమాత్మలా చిరునవ్వు నవ్వి, అభయ హస్తం చూపించి "పద" అన్నారు. ఎక్కడికి అని మారు మాట్లాడకుండా వెనకాల నడిచాను.

ఇద్దరమూ బాస్ గారింటికివెళ్ళాము. బాస్ గారు సాదరంగా ఆహ్వానించారు. బాస్ గారి పెళ్ళాంగారు కూడా కాఫీ టిఫినూ పెట్టి మర్యాద చేసింది. అవును మరి ఎంతైనా యమధర్మరాజును కదా ఎందుకు చేయదు అని నోట్లోనే కనిపించకుండా పళ్ళు నూరుకున్నాను. బాస్ గారి తో పిచ్చాపాటి మాట్లాడుతున్న ఏమండీగారి వైపు ఏమిటీయన ఎందుకు వచ్చాము, ఏమి మాట్లాడుతున్నారు అని చూస్తూ ఆవిడ అడిగిన దానికి ఏదో సమాధానం చెపుతున్నాను. కాసేపైనాక ఏమండి ఆవిడవైపు

చూసి,"మేడం మీరు నాటకం లో మా ఆవిడకు ఇంపార్టెంట్ పోర్షన్ ఇచ్చారట కదా. చాలా థాంక్స్" అన్నారు. నేను గాభరాగా ఏమండీ వైపు చూసాను.

"ఏమి పోర్షన్ ఇచ్చావు?" అని బాస్ గారు ఆవిడ ను అడిగారు.

"మేము నేను రాసిన "నవీన్ సావిత్రి"నాటకం వేస్తున్నాము. అందులో నేను సావిత్రి, మాల యమధర్మరాజ్" అంది నోరంతా తెరిచి నవ్వుతూ సంబరంగా.

ఆయన ఆవిడ వైపు కాసేపు సాలోచనగా చూస్తూ, "నువ్వు సావిత్రి గా వేస్తున్నావా వెరీ గుడ్. చాలా బాగుంటావు. నాటకం కూడా బాగుంటుంది" అన్నారు.

"మేడం మీరు పాటలు కూడా రాసి బాగా పాడతారట. పార్టీలో మీరు రాసిన పాట మాకు వినిపించవచ్చు కదా" అన్నారు ఏమండీ.

"పాటకు, నాటకానికి సమయం సరిపోదేమో" అన్నారు బాస్ గారు.

"నాటకం మేము ఎప్పుడైనా చూస్తాము. వచ్చే గెస్ట్ లకు మేడం పాట వినిపిస్తే బాగుంటుంది కదా" అన్నారు ఏమండి ప్లీజింగ్ గా.

ఆవిడ మురిసిపోతూ "సరే లెండి పాటే పాడుతాను. ఇప్పుడు నాటకం రిహార్సల్ కు టైం కూడా ఎక్కువ లేదు. నాటకం ఇంకోసారి వేయొచ్చు" అంది.

అమ్మయ్య ఆవిడ పాట పాడేందుకు ఫిక్సైపోయింది. ఈవిడ పాటలు కూడా పాడుతుందా అదీ సొంతంగా రాసి. అబ్బో ఎన్ని కళలున్నాయో! బాగా పాడుతుందా? పోనిద్దూ ఎట్లా పాడితే నాకేమిటి? బాగో వోగో
బాసమ్మగారి పాట వినక చస్తారా? మళ్ళీ నాటకం వేసే సమయానికి ఎవరెక్కడో! అప్పటి సంగతి అప్పుడే. ఇప్పటికి నా గండం గడిచింది. ఎంతైనా ఏమండీ గారి బుర్రే బుర్ర. వాళ్ళ కో నమస్కారం, ఓ థాంక్స్ పడేసి బతుకుజీవుడా అనుకుంటూ బయటపడ్డాను. లేకపోతే నేనేమిటి యమధర్మరాజ్ ఏమిటి? నన్ను యమధర్మరాజ్ గా సెలెక్ట్ చేసుకున్న బాసమ్మకు జోహార్!

❖❖❖❖❖






## తెలుగువాణి

*Radio 2TripleO FM 98.5MHz*

*8 -10AM on Saturday – Sydney Time*
*2.30 -4.30 AM on Saturday - India Time*
*(Please check for equivalent Local time@ your place)*

*Listen to Teluguvani on Radio 2Triple O FM 98.5MHz or DAB 985 or Listen audio by dialing: +61 2 8080 5650 Or Tunein App on Android / iPhone*

*Follow the links below :*

*https://Radio2tripleo.com.au*
*http://s7.viastreaming.net/8500/m*
*https://www.facebook.com/telugu.vani.52*

ఈవారం ప్రశ్న సమాధానం: *Please click the link below:*
*https://www.sydneytelugu.org/resources/evaram-prasna*

*Mrs Raja Tallapragada – Convener*

*Mr Chandrasekhar Raghavaraju -Coordinator*


*Mr Sai Gollapudi - Coordinator*

*For sponsorship and other details contact :*
*Convener on 0422 953 668 or*

*Email: vani@sydneytelugu.org*

# సంగీత నాదామృతం

డా. పద్మ మల్లెల, సిడ్నీ



గత సంచికలో దీపావళి సంబరాలతో ఈ సంచికలో పాఠకులందరికీ కార్తీక మాస శుభాకాంక్షలతో ప్రారంభించుకుందాం. ఇంతవరకూ మనం అన్నమాచార్యులు, వారి రచనలలోని విశిష్టత, సంగీత మార్గ దర్శకత్వం గురించి తెలుసుకున్నాం. వారి తరువాత సంగీత పరిణామ క్రమంలో తెలుసుకోవలసినది కర్ణాటకసంగీత పితామహులైన శ్రీ పురందర దాసుల వారి గురించి. వీరు 1484 లో శ్రీ వరదప్ప నాయక్ లీలావతి దంపతులకు కర్ణాటక లోని షివమొగ్గ జిల్లాలోని తీర్థహళ్ళి దగ్గర క్షేమపుర అనే గ్రామంలో జన్మించారు. వీరి అసలు పేరు శ్రీనివాస నాయక్. వీరు చాలా ధనిక వ్యాపారస్థుల కుటుంబం లో జన్మించారు. వీరు మొదట చాలా పిసినారిగా ఉండి దైవభక్తి లేకుండా ఉండేవారు. కానీ వీరి భార్య సరస్వతీ బాయమ్మగారి దైవ భక్తి ద్వారా పరమ భక్తునిగా మారి కర్ణాటక సంగీతాన్ని భావితరాలకు ఒక క్రమబద్ధమయిన రీతిలో అందేవిధంగా సేవ చేశారు. వీరు దాసకూట సాహిత్యం లో ప్రసిద్ధులైన వ్యాసరాయల వారి శిష్యులు. ప్రతి సంగీత విద్యార్థి ప్రప్రథమంగా నేర్చుకునే సరళీవరుసల ఆదిగా గల జంట వరుసలు, దాటువరుసలు, సప్త తాళ అలంకారాలు మరియు పిళ్ళారి గీతాల వరకూఒక క్రమబద్ధమయిన విషయానుక్రమణికను ఏర్పాటు చేసిన మహనీయులు. మనం గత సంచికలలో సంగీతం పరిణామక్రమంలో ముందు ఎలా ఒక్క కవిత్వం మాత్రమే పద్యాలుగా పాడబడేది, తరువాత జయదేవ కవి అష్ట పదులు అన్నమయ్య సంకీర్తనలు ఆవిర్భావంతో పదకవిత మరియు కీర్తన ఆవిర్భావం ఎలా జరిగింది అని చర్చించుకున్నాం. అయితే గమనించాల్సిన విషయం ఏమిటంటే అప్పటికి సంగీతం కవిత్వంనుండి విడివడే ప్రయత్నాలు జరిగాయి కానీ సంగీతం క్రమబద్ధీకరణ జరగలేదు. ఎవరికి తోచిన విధంగా వారు పాడుకోవటం జరిగేది. అటువంటి దిక్సూచి లేని ఒక మహా శాస్త్రానికి definite syllabus and structure ఏర్పాటు చేసిన వారు శ్రీ పురందర దాసుల వారు. ఈ క్రమంలో అలంకారాల తరువాత పిళ్ళారి గీతాలను ముందుగా రచించారు. ఇవి మనందరికీ అతి పరిచితమయిన మలహరి రాగం లోని శ్రీ గణనాథ, కుందగౌర, కెరెయ నీరను మరియు పదుమనాభా మొదలయినవి. తరువాత ఆనలేకర అనే గీతం కూడా కర్ణాటక శుద్ధసావేరి అనే రాగంలోశుద్ధ దైవతం, శుద్ధ రిషభంతో రచించినప్పటికీ కాలక్రమేణా ఇప్పుడు చతుశ్శృతి రిషభం, చతుశ్శృతి దైవతం తో శుద్ధ సావేరి రాగంలో ప్రదర్శింప బడుతోంది. ఇంకా ఈయన శ్రీ మద్భాగవతం సామాన్యులకి అందించే విధంగా అనేక వేల దాసర పదాలు రచించారు. అంతే కాక శ్రీ అన్నమాచార్యుల వారితో కలిసి భజన సంప్రదాయ కీర్తనలను అందించారు. వీటి గురించి మనం గత సంచికలో చెప్పుకున్నాం. ఇంకా వీరు కన్నడ భాషలో కృష్ణుని మీద పద్యాలు రచించారు. వీటిని ఉగభోగాలు అని అంటారు. ఇంకా ముఖ్యంగా మనం తెల్సుకోవలసిన విషయం ఏమిటంటే వీరు రచించిన సూళాది అనే రచన గురించి. మామూలుగా మనం సంగీత శాస్త్ర అభ్యాస

అనుక్రమణికలో అలంకారాల తరువాత గీతాలు నేర్చుకుంటాంకదా! అయితే ఈ గీతాలనే పురందర దాసుల వారు అలంకారాలలో ఉండే 7 తాళాలలో తాళమాలికలుగా కూర్చ బడిన రచనలన్నమాట. వీటినే సూళాదులంటారు. అయితే వాటి సంక్లిష్టత వలన కావచ్చు లేక వేరే కారణాల వలన కానీ ఈ రచనలు ఇప్పుడు కొంత మరుగున పడుతున్నాయని పేర్కొనవచ్చు. ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసురాలు కీ. శే॥ M. L. వసంతకుమారి గారు వీరి దాసర పదాల మీద విస్తృతమయిన research చేశారు. వీరి రచనలు ప్రస్తుతం బెంగుళూరు లోని శ్రీ పురందర దాస మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో పరిరక్షింప పడుతున్నాయి. ఇక్కడ మనం గుర్తించు కోవలసిన ఇంకొక ముఖ్య విషయం దాసర పదాలు అంటే పురందర దాసాదిగా కల అనేక మంది హరిదాసుల సాహిత్యంగానే పరిగణించాలి. వీరు పురందర విఠల అనే దైవముద్రతో రచనలు చేశారు. వీరు రమారమి 4లక్షల పైచిలుకు రచనలు చేస్తే వాటిలో ప్రస్తుతం 2000 రచనలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. వీరి రచనలు కన్నడ మరియు సంస్కృత భాషలో ఉన్నాయి. అయితే ఇక్కడ ఇంకొక విషయాన్ని పాఠకుల దృష్టికి తేవల్సింది ఏమిటంటే మన సంగీత development 2 dimensional గా జరిగింది. సంగీత శాస్త్రము మరియు గానకౌశల ప్రదర్శన (musicology and musical performance) అనే రెండు విభాగాలుగా విడిపోయి మొదటి నుండి వాగ్గేయ కారులు ఆధారం చేసుకొని తమ రచనలు చేసి సంగీత సిద్ధాంత శాస్త్రం మరియు సంగీత సిద్ధాంత కారులు తరతరాలుగా అనాదరణకు గురవుతూ వస్తున్నారు. AIR grading పుణ్యమా అని ఈ రోజుకు ఆ నిరాదరణ, చిన్నచూపు మరియు వివక్ష దురదృష్ట వశాత్తూ అలాగే కొన సాగుతున్నాయి. ఉదాహరణకి కావ్యాలతో పాటు మనకి క్రీస్తు పూర్వమే రచింపబడిన భరతాచార్యుల వారి నాట్య శాస్త్రం గురించి అతి కొద్దిమందికి తెలుసు. ఈయననే భరతముని అనికూడ అంటారు. క్రీస్తుపూర్వం 200 ఏళ్ల ముందు ఈయన నాట్య శాస్త్రాన్ని రచించారు. దీనిలో 36 అధికరణాలు 6000 శ్లోకాలు ఉన్నాయి. ఇవన్నీ కూడా నాట్య , నాటక మరియు సంగీత కళల యొక్క లక్షణాలను గురించి రచింప బడ్డాయి. ఒక రకం గా it can be stated as the primer of performing arts. దీనిలో హావ భావ ప్రదర్శన మరియు make up వంటి ఎన్నో విషయాలు చర్చింప బడ్డాయి. అయితే కాల క్రమేణ original text యధాతథంగా లభించ నందువల్ల మార్పులు చేర్పులు జరిగి ఇప్పుడు లభ్యంలో ఉన్న text 8వ శతాబ్దానికి స్థిరీకరింప బడింది. ఇందు లోని 36 అధికరణాలలో 28 నుండి 34 వ అధికరణం వరకూ మన సంగీతానికి సంబంధించిన theory and rules చర్చింప బడ్డాయి. ఈ శాస్త్రం లో వచింపబడ్డ సంగీత శాస్త్ర విషయాలు అనేక పురాణాలలో కూడా చెప్ప బడ్డాయి. ఉదాహరణకి అగ్ని పురాణం, మార్కండేయ పురాణం మొదలయినవి. కనుక ఈ భరత శాస్త్రం లో సంగీత వాయిద్యాల యొక్క విభజన 4 రకాలుగా చెప్ప బడింది. అవి తీగలతో కూడిన తంత్రీ వాయిద్యాలు, గాలి తో ఆధార పడిన సుషిర వాయిద్యాలు, లోహంతో చేయబడ్డ ఘున వాయిద్యాలు మరియు చర్మ వాయిద్యాలు. ఈ గ్రంథంలోని 15 మరియు 16 వ అధికరణాలలో సంగీత రచన యొక్క సాహిత్యానికి ఉండవలసిన వ్యాకరణం మరియు లక్షణాలు వివరింపబడి ఉన్నాయి. ఇవి పింగళ సూత్రం అనే వేదాంగం నుండి తీసుకొన బడ్డాయి. 28 వ అధికరణ లో శృతి స్వరం వంటి వాటి లక్షణాలు పేర్కొన బడ్డాయి. ఉదాహరణకి:

తత్ర స్వరః-

"షడ్జశ్చ ఋషభశ్చైవ గాంధారో మధ్యమస్తధా ।

పంచమో దైవతశ్చైవ సప్తమోఽద్య నిషాదవాన్॥"

\- నాట్య శాస్త్రం 28.21

అంటే నాట్య శాస్త్రం లోని 28 అధికరణంలో 21 వ శ్లోకం అన్నమాట.

ఇంకా ఒక సంగీత రచన లక్షణం నాదం, లయ మరియు ప్రాసల సమ్మిళిత మయినదిగా పేర్కొన బడింది. ఇంకా ఈ నాట్య శాస్త్రం యొక్క విశేషాలను వచ్చే సంచికలో కొనసాగిస్తాను.

ఈ సంచిక లో కీర్తన గురించిన విశ్లేషణ ఆపుతున్నాను ఎందుకంటే మనకి సంగీత విద్వాంసులందరూ మధించి పేరు తెచ్చుకుంటున్న కీర్తనలకు ఆధారమయిన సంగీత శాస్త్ర చర్చ చేస్తున్నాను కాబట్టి. పాఠకులు నాతో ఏకీభవిస్తారని ఆశిస్తూ సెలవు.

❖❖❖❖❖



## బాలవాహిని

### తెలుగు సామెతలు

- అభ్యాసము కూసు విద్య
- అమ్మ పుట్టిల్లు మేనమామకు తెలియదా
- అమ్మబోతే అడవి కొనబోతే కొరివి
- అరచేతిలో వైకుంఠం చూపినట్లు
- అవ్వా కావాలి బువ్వా కావాలి
- అరటిపండు వలిచి చేతిలో పెట్టినట్లు
- అర్ధరాత్రి మద్దెల దరువు
- ఆకలి రుచెరగదు నిద్ర సుఖమెరగదు
- ఆకలి వేస్తే రోకలి మింగమన్నాడట
- ఆకు వెళ్ళి ముల్లు మీద పడ్డా ముల్లు వెళ్ళి ఆకు మీద పడ్డా ముల్లుకే నష్టం

### వేమన శతకం


అనువుగానిచోట నధికులమనరాదు
కొంచెముండుటెల్ల కొదువ గాదు
కొండ అద్దమందు కొంచమై యుండదా?
విశ్వదాభిరామ! వినుర వేమ!

మనకు తగని ప్రదేశంలో గొప్పవారమని, ఎక్కువ అని అనుట మంచిది కాదు. మనకు గల గొప్పతనమును, ఆధిక్యతను ప్రదర్శించకపోయినంత మాత్రాన మన ఔన్నత్యమునకు భంగం కలగదు. కొండ ఎంత పెద్దదైననూ అద్దములో చూచినపుడు చిన్నదిగానే కనిపించును గదా! అని భావం.

తల్లిదండ్రి మీద దయలేని పుత్రుడు
పుట్టనేమి వాడు గిట్టనేమి
పుట్టలోని చెదలు పుట్టవా గిట్టవా?
విశ్వదాభిరామ! వినుర వేమ!

తల్లిదండ్రులపై ప్రేమలేని కుమారుడు పుట్టిననూ, చచ్చిననూ ఒక్కటే. పుట్టలలో పుట్టి ఎవరికీ ఉపయోగం లేక ఆ పుట్టలోనే చచ్చెడు చెదపురుగుల వలె తల్లిదండ్రులపై ప్రేమ లేని కుమారుని జన్మము వ్యర్థం కదా! అని భావం.

## తెలుగు గుణింతాలు నేర్చుకుందామా...




1. క కా కి కీ కు కూ కృ కౄ కెకేకైకొ కో కౌ కం కః
2. ఖ ఖా ఖి ఖు ఖు ఖూ ఖృ ఖౄ ఖె ఖే ఖై ఖొ ఖో ఖౌ ఖం ఖః
3. గ గా గి గీ గు గూ గృ గౄ గె గే గై గొ గో గౌ గం గః
4. ఘ ఘా ఘి ఘీ ఘు ఘూ ఘృ ఘౄ ఘె ఘే ఘై ఘొ ఘూ ఘౌ ఘం ఘః

❖❖❖❖❖

# అదే గమ్యం

శ్రీమతి అరుణ శర్మ నిమ్మగడ్డ, సిడ్నీ

**కరోనా ప్రభావంతో చాలా మంది జీవితాల్లో ముఖ్యమైన నిర్ణయాలు తారుమారయ్యాయి.ఇండియా, అమెరికా దేశాల మధ్య స్వల్పకాలం ప్రయాణ రాకపోకలు ఆగిపోయి, అప్పుడు జరిగిన సంఘటనలు సునీతని ఏగమ్యానికి చేర్చాయి????**

"నీ అభిప్రాయం ఏమిటి? వాళ్ళకి తెలియజేయాలికదా! కొడుకుని అడిగింది మహాలక్ష్మి.

"అమ్మా! నాకిష్టం లేదంటే ఆ అమ్మాయిని చూట్టానికి వస్తే చాలు రమ్మన్నావ్,"

"యిప్పుడిలా.........అన్నాడు సూర్యదేవ్

కొడుకు మాటలు వినిపించుకోకుండా "అమూల్య పేరులానే పెళ్ళికూతురు లక్షణంగా వుంది. "సంగీతం,ఇంజనీరింగ్ చదువు,ఉద్యోగం. అంతే నా! అందానికి అందం బారెడుజడతో కుందనపు బొమ్మలా మెరిసిపోతోంది.

మీ యిద్దరిజంట చూడ ముచ్చటగా వుంటుంది రా" !అన్నది కొడుకుని బుజ్జగిస్తున్నట్టు.

"తల్లి చెప్పేది నిజమే! అమూల్య చక్కగా వుంది,కాని తన ఆలోచన వేరే"! మనస్సు లోనే అనుకున్నాడు దేవ్.

మౌనంగావున్న అతన్ని చూస్తూ"నువ్వేమాట చెబితే వాళ్ళ వీలుకనుక్కోని చెల్లాయికి శ్యాం బావకి ఒకసారి పిల్లని చూపిస్తాను" అన్నది మళ్ళీ

"నే ఏమాటా చెప్పటమేమిటి? విసుగ్గా అన్నాడు దేవ్

'అంటే ఈ పెళ్ళి చేసుకోవా? ఆ పిల్లకేం తక్కువ?నువ్వు ఎందుకువద్దంటున్నావో అర్థం కావట్లేదు అని కొంచెం ఆగి, ఆ సునీత కోసమేగా?" అన్నది,ఆ పేరుని ఒత్తిపలుకుతూ.....

తల్లిలో యింత కాఠిన్యం? తన మీద ప్రేమా యిది ? ఆశ్చర్యం గా అనుకున్నాడు దేవ్.

పెళ్ళై అమెరికా వెళ్ళిన సునీతని తలుచుకోగానే మహాలక్ష్మి కడుపులో భగ్గుమంది. ఇప్పుడామ్మాయి విడాకులకు అప్లయి చేసిందని తెలిసిన దగ్గర్నించి దేవ్ పడుతున్న ఆరాటాన్ని గమనిస్తోందామె.

"వివాహమైన మర్నాడు ఆఫీసు వాళ్ళిస్తున్న పార్టీ కి వెళ్తూ, తలనిండ మల్లెలు, సంతోషంతో వెలిగిపోతూ భర్త రమణతో కలిసి తమయింటికొచ్చిన కొత్తపెళ్ళికూతురు సునీత ఆమె కళ్ళలో మెదిలింది....

ఒక్కగానొక్క మగ పిల్లవాడు,కోట్లకువారసుడు,ఒకసారి పెళ్లైన అమ్మాయిని మనువాడే కర్మ తనకొడుక్కేమిటి? ఆపిల్లకోసం ఆఫీస్ ద్వారా అమెరికా వెళ్ళటానికి ప్రయాణసన్నాహాలు చేస్తున్నాడు."

దేవ్ అమెరికా వెళ్ళటం ఎలాగైనా ఆపాలి,లేకపోతే పెళ్ళి చేసుకుని భార్యతో జంటగా వెళ్ళాలి". పట్టుదలగా అనుకుంది మహాలక్ష్మి."

కాని దేవ్ ఆలోచనా విధానం మరోలా వుంది.

ఎన్నో కలలుకని వివాహం చేసుకున్న సునీత పరిస్థితి డైవర్స్ దాకా వచ్చింది,రమణ నుంచి భార్యగా ఏ అనుభవం పొందని ఆమెని పెళ్ళిచేసుకుంటే తప్పేముంది? అయినా యింత వరకు ఆ మాటలు తమ మధ్య రానేలేదు,

నిజానికి ఒకవేళ అమ్మ అనుకున్నట్టు పెళ్ళి చేసుకున్నా తను చేసే త్యాగమేమీ లేదు.

చదువుకునే రోజుల్నించే ,సునీత తెలివి,పరిణతి,నిండైన ఆమె వ్యక్తిత్వమంటే తనకిష్టం, ఆరాధన కూడా! ఆమెకు తన బావతో చిన్నతనంలోనే పెళ్ళి నిశ్చయమైందని తెలిసి తన కోర్కె ను మొగ్గలోనే త్రుంచు కున్నాడు.

ప్రయాణానికి కావలసిన పనులకోసం ఆఫీసుకు శెలవు పెట్టిన దేవ్,తల్లి మళ్ళీ చదవబోయే మాటల దండకం వినటం యిష్టం లేనట్టు బయటికెళ్ళటానికి లేచాడు......

మరికొన్నాళ్ళకి న్యూస్ పేపర్ లో  అమెరికా అధ్యక్షుని ప్రకటన చదివి  దేవ్ నిట్టూర్చాడు. కొన్నివర్గాలవారికి వీసాలు రద్దుచేశారు. కరోనా విజృంభించటంతో విమానాలు కాన్సిల్  అయ్యాయి. అంతా అయోమయంగా వుంది.ప్రయాణం వాయిదా పడింది.
అమెరికా వెళ్ళటానికి అన్ని ఫార్మాలిటీస్  పూర్తయి ప్రయాణం చేసే సమయానికి కరోనా ప్రపంచమంతా కమ్ముకుంది, ముఖ్యంగా అమెరికాలో..
దీనిబారినుండి ఎప్పుడు బయట పడతామో ?అసలు ఎప్పటికైనా వెళ్ళగలనా? నిస్పృహ ఆవహించిందతనిలో.
బుక్ చేసిన టికెట్టు చేతికి తీసుకునేలోగా పరిస్థితులు ఎంత మారిపోయాయి." ఈవూళ్ళో లాక్ డౌన్ మొదలయ్యింది.అగమ్యగోచరంగా వున్న దేవ్ తేరుకుని తన లీవ్ కాన్సిల్  చేస్తున్నట్టు ఆఫీసుకు  ఫోన్ చేసి చెప్పాడు.

"ప్రయాణం వాయిదా పడ్డ దేవ్ తల్లి కోరికను తీరుస్తాడా??"

.......................................

అమెరికా లోని  న్యూయార్క్ నగరంలో నివసిస్తున్న సునీత  ఆఫీస్, మాన్ హ్యాటన్ లో. అక్కడి జనం క్రిస్టల్స్ మీద నడుస్తున్నట్టు పాదరసంలా జారిపోతు హడావిడిగా వుంటారు
'మాన్ హ్యాటన్ కు ఒక వైపున వున్న పెద్ద బ్రిడ్జ్ దాటితే బ్రూక్ లిన్ లో సునీత అపార్ట్మెంట్. తన కొలీగ్ అన్నగారి అమ్మాయి మయూఖితో  కలిసి వుంటోంది.
తెలుగు ఫిలిం ఫీల్డులోని ఒక సెలబ్రెటీ కూతురు మయూఖి. గ్రాడ్యుయేషన్ చేయటానికి న్యూయార్క్ వచ్చి  శెలవుల్లో ఇండియా వెళ్ళి కోవిడ్ కారణంగా అక్కడే చిక్కుకు పోయింది.
"వర్క్ ఫ్రమ్ హోమ్ అని ఆఫీస్ వాళ్ళు ప్రకటించటంతో యింట్లోంచే పనిచేస్తోంది సునీత. తన కాలేజి ఫ్రెండ్,కొంతకాలం కలిసి పనిచేసిన కొలీగ్ సూర్యదేవ్ న్యూయార్క్ వస్తున్నాడని అన్ని ఏర్పాట్లు చేసింది. కాని ఈ కోవిడ్ అతని రాకకు అడ్డొచ్చింది ! అతను వస్తే కాస్త ఒంటరితనం పోయి సంతోషంగా గడపవచ్చనుకున్న సమయంలో కరోనా!తెలియని నైరాశ్యానికి గురయింది సునీత.
తను దేవ్ కోసం ఎదురు చూడటం ఏమిటని లోలోపల సిగ్గు పడింది. ఏకాకితనం వల్ల తోడు కోసం పడే ఆరాటమా?దీనివల్ల బావని క్షమించగలిగే పక్వత తనకీ ఒంటరితనం నేర్పిస్తోందా! అంతేకాదు ఈ కోవిడ్ మనుష్యులను నెమ్మదిగా డిప్రెషన్ లోకి దారితీయిస్తోంది.
అవును! కొంతకాలం యిలాగే వుంటే అంతే" అనుకుంది..........
        నాన్నకి తన మేనల్లుడయిన   రమణంటే ఎంతో నమ్మకం ప్రేమ. కూతుర్ని పెళ్ళి చేసుకున్నవాడు, కొడుకైన అల్లుడైన అతనే అనుకున్న తండ్రిని తలుచుకొంటూ బావ సంగతి పూర్తిగా చెప్పకుండా ఏమీ జరగనట్టే ఉద్యోగరీత్యా చెరోచోటవుంటున్నామని చెప్పి అమెరికా లోనే వుండి పోయింది.
విడిపోతున్నాం అనుకున్నప్పటినుంచి బావ ఫోను కూడా చెయ్యటంలేదు ఎప్పుడైనా మెసేజస్ పెడతాడు, ఎలావున్నావని?"ఈ దేశంలోబావే తనకి తోడు"రమణ సూచనలతోనే పూర్వం యిండియాలో పనిచేసిన ఆఫీస్ తో డీలింగ్స్ వున్న ఐ.టి కంపెనీలో మంచిజాబ్ తెచ్చుకొని స్థిరపడింది తాను."
మరికొద్దిరోజుల్లో బావకి తనకి డైవర్స్ అవుతుంది,అప్పుడు డైవర్స్ సంగతి పెద్దవాళ్ళకి చెప్పాలనుకున్నారు.
ఇండియా వెళ్ళకుండా యిక్కడే వుండాలనే నిర్ణయం రైటేనా? తను తప్పుచేసిందా?"ఏమో? అత్తని అమ్మానాన్నను బాధ పెట్టకూడదని,ముఖ్యంగా చేసే ఉద్యోగం వదిలేసి ఎన్నో కలలతో  వచ్చిన తను వెంటనే  తిరుగు ప్రయాణం కట్టలేక వుండిపోయింది."

డైవర్స్ కి అప్లయిచేయటానికి వచ్చినపుడు తన మెళ్ళో తాళి చూచి బావ గిల్టీతో కృంగిపోయాడు.అవి యింకా ఎందుకని చూసినట్టనిపించింది తనకి. "నిజమే తీసిపేయాలా?....విడాకులు వచ్చేక అనుకుంటూ మెడలో వున్న మంగళ సూత్రాన్ని చేత్తో పట్టు కుంది సునీత.

......................................

కోవిడ్ కారణంగా ఇంట్లోంచే ఆఫీసుపని చేసుకుంటున్న రమణకు సునీత గుర్తుకొచ్చింది"ఈ కోవిడ్ లో ఆమె ఎలావుందో'? సునీత తన బంధువేకాదు అగ్నిసాక్షి గా పెళ్ళి చేసుకున్న భార్య అంతకంటే ఎక్కువగా తనకు స్నేహితురాలు కూడా!
కాని ఎన్నడు ఊహించని దూరం ఏర్పడింది మా మధ్య"బాధగా నిట్టూర్చాడు...........
ప్రపంచమంతా కరోనా, యిపుడందరిజీవితాల్లో యిదొక దశ.
ప్రతిఒక్కరి వర్తమానం నిస్తేజం చేస్తే,భవిష్యత్తును ఊహించలేక,గతజ్ఞాపకాలకు తెర తీసె సమయంగా మారింది.
ఆ తలంపురాగానే అతనికి తన జీవితం ఎన్నిమలుపులు తిరిగింది,యిందులో తన ప్రమేయంఎంతవరకు ?అనుకున్నాడు.
ఇండియాలో మంచిపోజిషన్ లో సెటిలయ్యే సమయానికి అమ్మా,మామయ్య కలిసి తను అమెరికాలో హయ్యర్ స్టడీస్ చేస్తే బావుంటుందని నిర్ణయించారు.
అప్పటికే మెరిట్లో సీట్ సంపాదించి ఇంజనీరింగ్ లో చేరింది సునీత,తను ఎం.ఎస్ పూర్తి చేసి ఉద్యోగం సంపాదించేలోగా ఆమె చదువు పూర్తవుతుంది. అపుడిద్దరికి పెళ్ళిచెయ్యాలని పెద్దవారి ఆలోచన.
తన ప్రాణసమానంగా భావిస్తున్న సునీతని వదిలి యిక్కడకు రావాలంటే తనెంత బాధ పడ్డాడు.
ఇంట్లో వాళ్ళ ప్రోద్భలం లేకపోతే ఒక్కడుగు కూడా ముందుకేసేవాడుకాదు.తమ ఎడబాటుకి బాధపడుతూనే సునీత తనకి నచ్చచెప్పి పంపించింది.
తండ్రి ఆర్థిక స్తోమత తెలిసిన మామయ్య తన కోసం అన్ని ఖర్చులు పెట్టటం భారంగా అన్పిస్తుంటే, అయిష్టంగా ఫ్లైట్ ఎక్కాడు.
అమెరికా లోని ఆస్టిన్ నగరంలో వున్న కజిన్ రాధ ఆమె భర్త రాజు గైడెన్స్ తో అక్కడి యూనివర్సిటీలో చదువుకుంటూనే లైబ్రరీలో, మరికొన్ని చోట్ల చిన్న చిన్న జాబ్స్ చేస్తూ కాస్త డబ్బు కూడబెట్టుకున్నాడు.

రమణ ఆలోచనలకు అంతరాయంగా...............బోధి తప్పటడుగులు వేస్తూ అతని దగ్గరకొచ్చాడు. చిన్న చేతులతో తింటున్న బిస్కెట్ ముక్కను తనచేతిలో పెట్టిన కొడుకునెత్తుకొని గట్టిగా ముద్దుపెట్టు కున్నాడు రమణ.
వాడిచేతులు కడిగి న్యాపీ మార్చగానే హాయిగా అనిపించిందనుకుంటా, తండ్రి భుజం మీద నిద్రకి ఒరిగాడు. పిల్లవాడిని బెడ్ మీద నెమ్మదిగా పడుకోబెట్టిన రమణకు అతను మొదటి సారి న్యూజెర్సీకి వచ్చినరోజు తలపుకొచ్చింది..................
"న్యూజెర్సీలో జాబ్ ఇంటర్యూ రావటంతో, ఆస్టిన్ నుంచి మకాం కూడా మారుస్తానంటే కజిన్ రాధ ఆమెకు తెలిసిన ఇండియన్ స్టూడెంట్స్ అడ్రస్ యిచ్చింది. అది తీసుకొని ఇంటర్యూ డేట్ కి ముందే బయలుదేరినతను ఎయిర్ పోర్టునుంచి సరాసరి ఆస్టూడెంట్స్ వుండే యింటికి పెళ్ళాడు...
రమణకు వారు రూములు ఖాళీల్లేవని మరో అడ్రసిచ్చి అక్కడికిపెళ్ళ బస్ రోడ్డుచివరే వుందని చెప్పటంతో, లగేజ్ తో నడవటం మొదలుపెట్టిన అతనికి అర్థమైంది అది రెండుకిలోమీటర్లు పొడవున్న రోడ్డని.
నడక అలవాటులేని రమణకు ఏ కష్టము తెలియకుండా పెంచి, చిన్నతనం నుంచి చదువేలోకమని చెప్తూ, గారాబంగా పెంచిన తల్లితండ్రులు గుర్తుకు వచ్చారు.
అంతేకాదు తమపిల్లల్ని విదేశాల్లో చదివిస్తున్నామని గర్వంగా చెప్పుకొనే మధ్యతరగతి తల్లితండ్రులు తలపుకొచ్చారు ,వాళ్ళపిల్లలు దేశంకానిదేశంలో ఎదుర్కొనే బాధలు,ఆర్థికంగా పడే అవస్థలు ఆలోచించరు,తెలియదు కూడా ఆ పేరెంట్స్ కి ! .....

ఆలోచిస్తూ నడుస్తున్న రమణకి ఆకలితో కళ్ళు తిరిగినట్టయి లగేజ్ ప్రక్కన పెట్టి,డబ్బు, పాస్ పోర్టు ముఖ్యమైన పేపర్స్ వున్న బ్యాగ్ ని గట్టిగా పట్టుకుని రోడ్డు మీద ఒక యింటి ముందు కూలపడ్డాడు......

నెమరుపేసుకుంటున్న జ్ఞాపకాలకు ఫుల్ స్టాప్ పెడుతూ ల్యాండ్ లైన్ ఫోన్ శబ్దం చేస్తూ మ్రోగటంతో బోధి నిద్రలేస్తాడని ఫోన్ దగ్గరికి పరుగు తీశాడు రమణ.

....................................

"హాయ్! సోఫియా! యింటికా? దూరం నుంచే అడిగింది నర్స్ ఎమీల. ముఖానికి మాస్క్ వుండటంతో మాట్లాడకుండా అవునన్నట్టు తలూపి కారెక్కిన సోఫియా కార్ పార్క్ నుంచి కారుని రివర్స్ చేస్తూ మిర్రర్లో "న్యూ జెర్సీ పబ్లిక్ హాస్పిటల్ "అన్న పెద్ద బోర్డు వంక సంతోషంగా చూసింది!

ఆమె రొటీన్లో అదో భాగం. ఊహ తెలిసిన దగ్గిరనుంచి ఆ సమీపంలో నివసించటం వల్ల ఆ పరిసరాలను తన సొంతం చేసుకుంది. ఇంటికెళ్ళి కాస్త ఫ్రెష్ అయి సూపర్ మార్కెట్కి వెళ్ళాలనుకున్న ఆలోచన విరమించుకొని దారిలో ఆగి పాలు మరికొన్ని వస్తువులు కొనుక్కొని త్వరగా బయటపడిందామె.

పాల క్యాన్ కడిగి ఫ్రిజ్ లో పెట్టినా మిగిలిన వస్తువులు ఎయిర్ ప్యూరిఫయర్ ముందు రెండుగంటలపాటు వుంచుతున్నారు,అదో పెద్ద పని"ప్రొద్దున్న ఏడు గంటలకు యిల్లు వదిలింది.

కరోనా కారణం గా "డే కేర్ సెంటర్ కి "వెళ్ళ ని బాబుని యింట్లో వుండి చూసుకుంటూ, ఆఫీస్ వర్క్ చేస్తున్నాడు రమణ.అది గుర్తుకురాగానే త్వరగా వెళ్ళాలని కారు స్పీడ్ పెంచింది"

ఇప్పుడు కరోనావార్డులో పనిచేస్తూవుండటంవల్ల,యింటికొచ్చేలోపలే చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి వస్తోంది,ఈ రోజు కరోనా ఇన్ ఫెక్షన్ ఆమెకు సోకినట్టనిపిస్తోంది.

ఫీవర్ టెస్టు రోజూ చేస్తున్నా జలుబు,ఏదీమ్రింగలేనట్టు గొంతు నొప్పి మొదలైందని క్రితం రోజు కోవిడ్ టెస్టుకి వెళ్ళింది.ఈ పూట అలసట ఫీలవుతోంది.

"మీ ఫాదర్ డేవిడ్ కి కరోనా పాజిటివ్ ట, యిప్పుడే హోం నుంచి ఫోన్ వచ్చిందన్నాడు రమణ అప్పుడే యింట్లోకి అడుగు పెట్టిన సోఫియా వంక చూస్తూ......

ఓ గాడ్!డాడీక్కూడానా! అదేనా? నా మొబైల్ లోహోం వాళ్ళు చేసిన మిస్డ్ కాల్ వుంది."అన్నది

"కూడా నా! అంటే యింకెవరికీ?? ఆతురతగా అడిగాడు

"నేనూ ఈ పాండమిక్ లో చిక్కుకున్నాననిపిస్తోంది డియర్"

"నీకూనా? భయంగా అన్నాడు.

"రిలాక్స్! నాట్ ష్యూర్, అనిపిస్తోంది అంతే' అని బోధి నిద్రపోతున్నాడా? అడిగింది.

"ఆ పడుకున్నాడు"

"థాంక్ గాడ్'

"సరే నీ రిజల్టు' అన్నాడు.

రాలేదు!! ఓ.కే! యిప్పుడు బోధి దగ్గరికి వెళ్ళను అంటూ, ఫ్రెష్ అయి వచ్చినామె, "రమన,డాడీని చూసి వస్తాను అని చెప్పి హడావిడిగా వెళ్ళి పోయింది.

"డేవిడ్ ని కరోనా ట్రీట్ చేసే ప్లేస్ కు తరలించేదాకా అక్కడేవున్న సోఫియా తన టెస్ట్ పాజిటివ్ రావటంతో, డాక్టర్ దగ్గరికి వెళ్ళింది. డాక్టర్ చూసిఎక్కువ ప్రమాదం లేదని చెప్పి ఐసోలేషన్ రికమండ్ చేశారామెకు. మందులు కొనుక్కో ని యింటికొచ్చినామె రమణ,బోధిని కూడా కరోనా టెస్ట్ కు పంపింది.

అప్పటి దాకా పరుగులు పెడుతూ తిరిగిన సోఫియా తమ యింట్లోనే ఒంటరిగా గదిలో కూర్చోగానే అనారోగ్యంగా వున్న తండ్రి గుర్తొచ్చి ఆయన్ని మళ్ళీ చూస్తానా? అని అనుకున్న ఆ ఊహకే ఆమెకి కన్నీరు ఉప్పెనలా పొంగిపొరలింది.తల్లి తమను వదిలేసి మరో పెళ్ళి చేసుకొని వెళ్ళిపోయినపుడు యిలాగే రోదించింది.

సైకాలజీ ప్రొఫెసర్ తన తండ్రి. స్లిప్ డిస్క్ వల్ల సంసారజీవితానికి పనికిరాడని తెలుసుకున్న తల్లి, తమ్ముణ్ణి తీసుకు వెళ్ళిపోయింది.ఆమె పేరున్న డాక్టర్.తండ్రిని ఆమె ప్రేమించిందనటానికి గుర్తు గా, తండ్రి యిష్టపడే తనని, సమిష్టి ఆస్తి అయిన ఈ యిల్లువదిలి నిష్క్రమించింది.బోధిని ప్రెగ్నెంట్ గా వున్నపుడు పన్లు చేసుకోలేక, తనకు భారంకాలేక కేర్ హోం లో చేరిన తండ్రికిప్పుడు కరోనా సోకింది, యిప్పటికే కోవిడ్ తో మరణించే వారి సంఖ్య ఎక్కువయింది.
తను హాస్పిటల్లో కరోనావింగ్ లో పనిచేస్తోంది, ఏంజిల్స్ లా పేషంట్స్ ని శ్రద్ధగా చూస్తున్నారు నర్స్ లందరు."........
ఒంటరిగా గదిలో పడుకుని వున్న సోఫియా ఆ రాత్రంతా గతాన్ని తలుచుకుంటూ గడిపింది.
ఇన్ని సంవత్సరాల్లో చాలామంది ఇండియన్ డాక్టర్స్ తో కలిసి పని చేసింది. ముఖ్యంగా ఎమర్జన్సీ వార్డులో నైట్ డ్యూటీ చేసేటప్పుడు, అసిస్టెంట్ డాక్ట ర్స్ తో కాసేపు మాట్లాడే ఛాన్స్ దొరికేది.భారతీయుల పెళ్ళిలోని కట్టు బాటు,లార్డ్ రామకధలు చెప్పేవారు. అందుకేనేమో తనకు ఇండియన్స్ అంటే యిష్టం.....
అలా అనుకోగానే రమణ, అతన్ని కలిసిన రోజు గుర్తు కు వచ్చింది సోఫియాకు..........
"ఆ రోజు డ్యూటీ చేసి యింటికి వచ్చిన సోఫియా, తమ యింటి ముందు కూర్చున్న ఒకతన్ని చూసింది. మళ్ళీ సూపర్ మార్కెట్ కెళ్ళి తిరిగివచ్చినతక్కడే వుండటం గమనించి,సహజంగా సేవాగుణంవున్న సోఫియా నీరసంగా,పూర్తి స్పృహలో లేనట్టున్నతన్ని నెమ్మదిగా లేపి ప్రక్క నే వున్న డాక్టర్కి చూపించింది.
క్రొత్త,చలిప్రదేశంవల్ల నిమోనియా వచ్చిందనటంతో ఏ ఆధారంలేని, జ్వరంతో వున్న అతన్ని వారి యింట్లోరెండువారాలు కనిపెట్టుకునివుంది.
జాబ్ లేక,నిస్సహాయ స్థితిలో వున్నపుడు తన యింట్లోనే స్థానమివ్వటంతో కృతజ్ఞతా భావం , ఆ అమెరికన్ యువతి మంచితనం రమణని కట్టిపడేసింది.
స్పురద్రూపి,చదువు,సంస్కారమున్న రమణ అంటే మొదటి చూపులోనే గౌరవం కలిగింది సోఫియాకు.ఉద్యోగం వచ్చాక కూడా పేయింగ్ గెస్ట్ గా ఆయింట్లోనే వున్న అతడు ఆమె స్నేహితుడిగా కొన్నాళ్ళు,
ఆపై అతన్ని తన వాడిగా చేసుకోవాలనే బలమైన కోరికతో వున్న సోఫియా యిచ్చిన ఉత్తేజం, ప్రోత్సాహం రమణను వివశత్వానికిలోను చేసి ఫలితంగా ఆమెకు దగ్గరయ్యాడు.
సునీతతో తన పెళ్ళి గురించి చెప్పినా సోఫియా తొణకలేదు, జాబ్ లో స్థిరపడటం వల్ల తల్లితండ్రులు ఏకంగా సునీతతో పెళ్ళని శుభలేఖలు పంపుతూ రమ్మని రాయటంతో పెళ్ళి వాయిదాపెయ్యలేక సోఫియాతో వున్న సంబంధానికి ఒక రూపంలేక సందిగ్ధంలో గత్యంతరం లేనట్టు ఇండియా వెళ్ళి సునీతను పెళ్ళి చేసుకున్నాడు.
కాని భవిష్యత్తు ఏమిటో అర్ధంకాక సునీతతో శారీరక సంబంధం పెట్టుకునే మనస్సు లేక ఆసందర్భం రాకుండా జాగ్రత్త పడ్డాడు రమణ.
ఇండియా నుంచి పెళ్ళిచేసుకుని వస్తున్న తన్ని సోఫియా ఎలా రిసీవ్ చేసుకుంటుందో అని మథనపడ్డ రమణ,ఎయిర్ పోర్టుకు వచ్చిన ఆమె ముఖం ఆనందంతో వెలిగిపోతూ వుండటం గమనించాడు.
"రమన" అతన్నిపిలుస్తూ దూరంనించే సంతోషంగాచెయ్యూపింది సోఫియా.
"ఐ మిస్ యూ' అంటూ సంతృప్తి తో అతన్ని హత్తుకుంది.
పెళ్ళి చేసుకువచ్చాను బాధగా వుంటావనుకున్నా? అన్నాడు అహ్లాదంగా వున్నామెను చూస్తూ.
"ఓ గుడ్ న్యూస్ వుంది లవ్! 'అదే నా హ్యాపీనెస్ కి కారణం' వూరిస్తున్నట్టుగా అంది.
ఏమిటంత గుడ్ న్యూస్"
"ఆమె తన సంభ్రమమును నొక్కిపెడుతూ తాను గర్భవతినని నెమ్మదిగా చెప్పింది.
"అది విని ఏదో తెలియని భావంతో మౌనంగాను, సీరియస్ గా అయ్యాడు.
తన మనస్సు,శరీరం రమణకే అర్పించటంవల్ల అతన్నే భర్తగా భావిస్తున్నసోఫియా,తనతల్లి ప్రవర్తన నచ్చని ఆమె తనజీవితంలో మరో మగవాడికి స్థానంలేదనుకుంది.

పుట్టబోయేబిడ్డతో తన బ్రతుకంతా సంతోషం గా గడిపేస్తానని, సునీత అమెరికా వచ్చినా తమకు లీగల్ గా మరేబంధంలేదు కనుక తాను వారికి అడ్డు రానని రమణకి ధైర్యం చెప్పింది.
"మరి కొన్ని రోజులు పడుతుంది సునీత యిక్కడకు రావటాని ఆఫీసులో చేపట్టిన క్రొత్త ప్రాజెక్ట్ పూర్తి చేసి కాని రాలేదట". ఈ విషయాన్ని కబుర్లమధ్యలో సోఫియాకు చెప్పాడు.
సోఫియాకి నెలలు నిండేసమయానికి అమెరికా వచ్చింది సునీత.
న్యూయార్క్ లో సునీతకోసం అపార్ట్ మెంట్ అద్దెకు తీసుకొన్న రమణ అప్పుడప్పుడూ వస్తూ వెళ్తున్నాడు.తానతని భార్యనయ్యాననే మాట గుర్తు లేనట్టు ముభావంగా వున్న రమణ ప్రవర్తన,జాబ్ వేరే చోట చేస్తూ యిల్లు యిక్కడ తీసుకున్నాడన్న అనుమానం వున్నా అతనిపై వున్న నమ్మకం, తెలియనక్కడి పరిస్థితి, పైగా ఆదేశంలోనిలద్రొక్కుకోవాలనే ఆరాటంలో అంతగా పట్టిచ్చుకోలేదు సునీత.
నెల రోజులకు ఆమెకి జెట్ ల్యాగ్ తీరి ఆ పరిసరాలు అలవాటయ్యాక జాబ్ అప్లికేషన్ పెట్టిచ్చాడు.రమణ.
“ఒంటరిగా పడుకుని వున్న సోఫియాకు ఆలోచనలు ప్రవాహంలా ముసురుకున్నాయి. తను ప్రసవించినరోజు గుర్తుకు వచ్చింది” .
“హలోరమణస్పీకింగ్"
"సోఫియాకి లేబర్ పెయిన్స్ వస్తున్నాయా? "వెంటనే వస్తున్నాను"
హాస్పిటల్ వాళ్ళు చెప్పగానే ఆఫీస్ నుంచి త్వర త్వరగా బయలుదేరాడు.
“రమన”! అని అతని చెయ్యి గట్టిగా పట్టుకుంది నొప్పులు పడుతున్న సోఫియా.
ఆమె బాధ చూడలేక పోయినా, బాబు భూమ్మీదకొచ్చి వాడి ఏడుపు వినపడగానే అతని మనస్సు పులకించింది.
అలసిన ముఖం మాతృగర్వంతో వున్న ఆమె ఆక్షణంలో అపురూపంగా కనిపించింది,బంగారువర్ణంలో పట్టుకుచ్చులావుండే సోఫియా జుత్తును సరిచేస్తున్న రమణకి, అతని పోలికలతో వున్న బాబుని తెచ్చి చేతికిచ్చింది నర్స్. నల్లని వెంట్రుకలు, నల్లటి కనుపాపలుఎరుపువర్ణంతో కూడిన పసిమిఛాయ వాడిని మురిపెంగా చూస్తూ ఎత్తుకొని గుండెలకు హత్తు కున్నాడు.
“రమణని, కూతుర్ని, మనవణ్ణి చూసుకుని తృప్తిగా ఊపిరిపీల్చుకున్నాడు డేవిడ్.”
బాబు బర్త్ సర్టిఫికేట్లో సోఫియా యింటిపేరు యివ్వటం చూసిన ఆ క్షణంలోనే సునీతకి జరుగుతున్నవి చెప్పాలన్న ఆలోచనకు బీజం పడింది రమణ మనస్సులో.
“బోధి అని నామకరణం చేసి ఆ బాబుతో గడుపుతున్న కొద్దీ వాణ్ణి వదులుకోలేననిపించిందతనికి. ఆ సమయంలో సునీతతో మాట్లాడటానికి చాలా శక్తిని కూడ తీసుకున్నాడు.
బావ మాటలు విన్న సునీత ఆశ్చర్య పోయింది,అసలు తన్ని పెళ్ళెందుకుచేసుకోవాలని అసహ్యించుకుంది,లోలోపల దుఃఖ పడింది.
సోఫియాతో వున్న రిలేషన్ గురించి చెప్పిన రమణ మరింకేం మాట్లాడ లేక వెళ్ళిపోయాడు అప్పట్నించి అతను పూర్తిగా న్యూజెర్సీలోనే వుండటం గమనించింది సునీత.
ఇద్దరు మౌనంగా కొంతకాలం గడిపి చివరికి విడాకులు తీసుకోవటం సరైన నిర్ణయమనుకున్నారు.
విడాకులువల్ల సునీత మరో క్రొత్త జీవితం ఆరంభించవచ్చని రమణ భావిస్తే, బాబు భవిష్యత్ కోసం సోఫియాని లీగల్ గా పెళ్ళి చేసుకుంటే మంచిదని సునీత తలచింది.
..........రమన, తన మనస్సు, సునీతతో మాట్లాడిన, జరిగిన ప్రతి సంఘటన సోఫియాకి చెప్పినపుడు సునీతతో విడాకులు వద్దని అంది.
సునీతకు తను అన్యాయం చేస్తోందా? ఎంతబాధయినా తను రమనకి దూరంగా వుండడానికి సిద్ధంగా వుంది కదా!!!

సుదీర్ఘమైన ఆలోచనల్తో అలసిన సోఫియా నిద్రలోకి జారింది.

"ఎవరు బావా ఏమంటున్నావ్" చాలాకాలం తర్వాత ఫోను చేసిన రమణ మాటలర్ధంకాక అడిగింది సునీత.
"కరోనాతో సోఫియా చనిపోయింది.!" షి ఈజ్ డెడ్." దుఃఖంతో అన్నాడు."రెండువారాలుగా బాధపడుతోంది కాని అంత ప్రమాదం లేదనుకున్నాము. "హఠాత్తుగా లాస్ట్ వీక్ అర్ధరాత్రి బాగా ఆయాసపడుతుంటే హాస్పిటల్లో చేర్చాను. వారం రోజులు పోరాడింది. ప్రొద్దునే హాస్పిటల్ నుంచి బ్యాడ్ న్యూస్ వచ్చింది."
"సునీతా! సోఫియా తండ్రి డేవిడ్ కూడా కరోనాతో మరణించారు.ఆయనకి కూతురంటే ప్రాణం,"ఐ థింక్ హి హాజ్ టే కెన్ హర్" కదూ? అన్నాడు.
రమణ చిన్నపిల్లాడిలా ప్రశ్నిస్తూ,, శోకిస్తుంటే బోధి భయంగా తండ్రి వంక చూచి ఏడవటం మొదలుపెట్టాడు."బోధి! అంటూ పిల్లవాడిని గట్టిగా కౌగిలించుకున్నాడు.
"సునీతా హాస్పిటల్ వాళ్ళు సోఫియాను చూడనీయలేదు" కరోనా వల్ల డెడ్ బాడీ యివ్వరట అని చెప్పి రోదిస్తున్న అతన్ని ఓదార్చటానికి ప్రయత్నించింది.
"మా బంధం తీరి పోయింది కదూ?'
"లేదు బావా అలా అనొద్దు, బాబు వున్నాడు" అన్నది.
"అవును నా బాబు వున్నాడు" అతనికి దుఃఖంతో గొంతులోంచి మాట రాలేదు."
"బోధి అచ్చం నా పోలికే అనేది సోఫియా," నన్ను రమన అని పిలిచేది. సోఫియా గురించి ఉద్వేగంతో మాట్లాడుతువున్న అతన్ని"బావ! బావ! అని ఖంగారుగా పిలిచింది.
"బావ నీతో మధ్యాన్నం మాట్లాడనా?" అని అతని మాటల ఒరవడిని ఆపుతూ అడిగిన సునీత మరికొద్ది గంటల్లో దిక్కుతోచనట్టు కూర్చున్న రమణ ముందు నిలబడింది.
"అవును దీపానికి వెలుగునివ్వటమే తెలుసు"....
సునీత తన దగ్గరకు వస్తుందని ఊహించలేదు రమణ.
తిండి,నిద్ర సరిగా లేక కృషించివున్న రమణ, తప్పి పోయిన చిన్న పిల్లవాడు అమ్మవడి చేరినట్టు ఆమెను పట్టుకుని కన్నీరు కార్చాడు.
ఆ కన్నీటిలో కొద్దికాలంగా సందిగ్ధావస్థలో నలిగి పడినయాతన,బాధ మంచులా కరగసాగాయి.
విధి యిచ్చిన తీర్పును ఆమోదిస్తూ హుందాగా, అదే స్థైర్యంతో తన బావని, ముమ్మూర్తులా రమణలా వున్న బోధిని, మనసా వాచా కర్మణా వీరిద్దరు నా సొత్తు అనుకుంటూ వారిని అక్కున జేర్చుకుంది సునీత.

❖❖❖❖❖



శనగపిండి ఉల్లిపాయ చిన్న మిరపకాయలున్
చొనిపి అందు అల్లమంత దొనిపి అందుపైచినన్
అనల తప్తమైన నేతి అందు పైచి పేచినన్
చను 'పకోడి' అనెడు పేర చక్కనైన ఖాద్యమౌ –

**తిరుపతి వెంకట కవులు**


TaxNET
AUSTRALIA
Suit 7 Level 7,Strathfield Plz.
11 Boulevarde Pde
Strathfield, NSW 2135
Gopal K Gatiganti
Regd. Tax Agent
Ph: 9746 5858 Fax: 9746 5865
Mob: 0433 333 585
gopal@taxnetaustralia.com.au
www.taxnetaustralia.com.au


Private courtyard available upto 50 people
Catering available
Royal
Paradise Biryani
Royal
Paradise Biryani
02 9763 5282
reservations@royalparadisebiryani.com.au
14 George Street North Strathfield
NSW 2137.

WESTMEAD
DOCTORS

## GENERAL PRACTICE

Telugu and
Hindi speaking
Female GPs
Male GPs

## ALLIED HEALTH

Psychologist
Physiotherapist
Podiatrist
Dietitian

## SPECIALISTS

Paediatricians
Adult Physician
Geriatrician
Cardiologist

## ONSITE PATHOLOGY





**Shop 6, Coles Complex**
**29-33 Darcy Road**
**WESTMEAD**

PH: 9687 4000
WESTMEADDOCTORS.COM.AU

Open 7 days

BULK BILLING AVAILABLE




**Dr. Murali Thiruvengadam**
MBBS, FRACGP

Principal GP, Conjoint Lecturer
Western Sydney University

Fluent in:
Hindi, Tamil, Telugu, Malayalam

RRMC RAILWAY ROAD MEDICAL CENTRE
QUALITY COMMUNITY CARE

P: (02)88891383 | F: (02)86254326

# Bulk Billing

OPEN 7 DAYS

New Medical Centre at
## Quakers Hill

Mon - Fri: 8.00am - 8.30pm
Sat: 8.00am - 6.00pm
Sun: 8.00am - 12.00pm

G02 / 25 Railway Road
Quakers Hill, NSW-2763

88891383
Fax: 86254326

www.railwayroadmedical.com.au


SRI LAKSHMI SUPERMARKET
SLS
WEEKEND DEALS
Friday
Saturday &
Sunday Only
FRUIT & VEG
SPICES & LENTILS
FROZEN FOODS
UTENSILS
SNACK
FLAVOURS
RICE
Visit our store for
Weekly specials
WIDE RANGE OF GROCERIES,
INDIAN, SRILANKAN, NEPALESE,
PAKISTAN & BANGLADESH
86 Station Street,
Wentworthville NSW 2145

## తెలుగు వాహిని పాఠకుల స్పందన

వాహిని సంచిక షిర్డీసాయి ముఖచిత్రం తో చూడముచ్చటగా వుంది. సంపాదకీయం లో మానసిక ఆరోగ్యానికి కావల్సిన ఔషధాలు బాగా వివరించేరు. పెయ్యేటి రంగారావు గారి పరమాత్మ గేయం చాలా ఆర్తి గా వుంది. పోతన గారి పద్యాల లో గి గీ లు చాలా వివరణాత్మకంగా వున్నాయి. నా మంచి కలమా ,సర్దుబాటు కథ చాలా బాగున్నాయి.

**శ్రీమతి విజయ చావలి, సిడ్నీ**

సాయిబాబావారి ముఖచిత్రంతో వెలువడిన అక్టోబర్ వాహిని, సంపాదకీయంతోనే స్వాంతన పలికింది... మానసిక ఆరోగ్యానికి అందించిన సాధనాలను ఉపయోగించుకోవాలనే సంపాదకుల ఆకాంక్ష నెరవేరుద్దాం... ఇంద్రియాలను ఎలా అదుపులో పెట్టుకోవాలో భగవద్గీతలో చక్కగా ఉటంకించారు... పెయ్యేటి రంగారావుగారి వివరణ మనసును ప్రక్షాళణ చేసేదిగా వుంది...
వాహిని మూడవ సాహితీ సదస్సుపై ఇచ్చిన వివరణ, ఫోటోలు చాలా బాగున్నాయి... ప్రత్యక్షంగా చూడలేకపోయినవారికి చక్కటి అపురూప అవకాశం... ఆస్ట్రేలియాలో అమెరి 'కంగారు' కథలో చిట్టెన్ రాజుగారు చక్కటి హాస్యం జోడించారు... ఇంతకీ తెలుగు సాహితీ సదస్సుకు మెల్ బోర్న్ వెళ్ళారా లేదా?..
అన్నీ నేర్చుకోవాలనే తపనతో కమలగారి 'పౌరుషిణి-2' మంచి ఇన్స్పిరేషన్ ఇచ్చింది... ఎప్పుడూ నేర్చుకుంటూ వుంటేనే జీవితంలో ఉత్సాహం పెరుగుతుంది... గొలుసుకట్టు నవల 'నీహారిక' ఆసక్తికరంగా వుంది...

**శ్రీమతి షామీరు జానకీ దేవి, హైద్రాబాద్**

❖❖❖❖❖



Tamarama Beach


Swagath
Biryani House
(02) 8810 6690
http://www.swagath.com.au
46 Station Street
Wentworthville
NSW 2145

❖❖❖❖❖


Venkat Kantipudi, B.Com, MPA, FIPA, FTIA
HOME LOANS
INVESTMENT & SMSF LOANS
TAX RETURNS & ACCOUNTING
Mortagage Broker & Tax Agent
Suite 11/55 Phillip St, Parramatta, NSW
Phone: 02 9633 2536 Mob: 0421 374 365
Email: venkat@associatedaccounting.com.au

❖❖❖❖❖

# సీతాకోకచిలుక

గొలుసుకట్టు నవల

సంధానకర్త :

**నండూరి రామచంద్రరావు**

## 10

## (సునీత గంగవరపు)

బ్యాంక్‌లో పెద్దగా రద్దీ లేకపోవడంతో కుర్చీలో రిలాక్స్‌డ్‌గా వెనక్కు వాలి కిటికీలోంచి బయటకు చూశాడు మూర్తి. అప్పుడే బ్యాంక్ ముందు ఆగిన ప్రభుత్వ వాహనంలోంచి ఒక వ్యక్తి దిగి సరాసరి మూర్తి క్యాబిన్‌లోకి వచ్చాడు.

తన ఐడీ కార్డు చూపించాడు. జాయింట్ సెక్రటరీ లెవెల్ ఆఫీసర్ ఆయన.

మూర్తి కాఫీ కోసం చెప్పబోతుంటే, "వద్దు సర్, కొంచెం ముఖ్య విషయం మీతో మాట్లాడాలి. చాలా అర్జెంట్." అన్నారు. "చెప్పండి".

"ఒక చిన్న విన్నపం, చీఫ్ సెక్రటరీగారు నన్ను పంపారు. అతి ముఖ్యమైన విషయం ఏదో మీతో మాట్లాడాలట. మిమ్మల్ని అర్థించి, నాతో తీసుకుని రమ్మని పంపారు."

కొద్ది క్షణాలు ఆలోచించిన మూర్తి అసిస్టెంట్‌కు తన పని అప్పగించి చీఫ్ సెక్రటరీని కలవడానికి ఆ అధికారితో కలిసి బయలుదేరాడు.

ఎంతో గౌరవంగా మూర్తిని చీఫ్ సెక్రటరీ రూంలోకి తీసుకెళ్లారు.

అక్కడ సెంట్రల్ హోంమినిస్ట్రీ సెక్రటరీతో పాటు రా(ఆర్ఏడబ్ల్యూ) చీఫ్ ఉన్నారు. అందరి పరిచయాలు అయ్యాక వారి ఐడీ కార్డ్స్ చూపించమని మూర్తి అడగడంతో కాస్త ఆశ్చర్యపోయినా ఆ తర్వాత చిన్నగా నవ్వేసి తమ కార్డ్స్ మూర్తికి చూపించారు. ఈ లోపల కాఫీ స్వయంగా జాయింట్ సెక్రటరీగా తన దగ్గరకు వచ్చిన వ్యక్తి తీసుకురావటం ఆశ్చర్యంగా అనిపించింది. ఆఖరికి కారు కూడా ఆయనే నడిపించాడు. డ్రైవర్ లేదు. ఆలోచిస్తుంటే తనకి ఈ నలుగురు మనుషులు తప్ప ఇంకో వ్యక్తి తారసపడలేదు. విచిత్రంగా అనిపించింది మూర్తికి.

ఆ తర్వాత కొద్ది క్షణాల మౌనంతో అక్కడి వాతావరణం గంభీరంగా మారింది. గొంతు సవరించుకొని రా చీఫ్ మొదలుపెట్టాడు ముందుగా.

"ఈ మీటింగ్ జరగలేదు. అంటే అఫీషియల్‌గా. ఎక్కడా రికార్డు లేదు, ఉండదు."

"ఏ మీటింగ్, "మూర్తి అమాయకత్వంగా నటిస్తూ అడగటంతో ఒక్కసారిగా అందరూ నవ్వారు. రూంలో కొంచెం స్నేహపూరిత వాతావరణం నెలకొంది.

"మూర్తిగారూ, అత్యంత గోప్యనీయమయిన ప్రభుత్వ రహస్యాలు మీకు చెప్తున్నాం. మీరు వాటి గోప్యనీయత కాపాడుతారని మాకు పూర్తి నమ్మకం ఉంది. దయచేసి ఆ నమ్మకాన్ని దూరం చేయకండి. మా కోసం కాదు. ఈదేశం, మన

దేశం కోసం. కొన్ని విచ్ఛిన్నకర శక్తులు ఈ హైదరాబాద్‌ని కేంద్రంగా చేసుకొని మొత్తం దేశమంతా అలజడులు సృష్టించే ప్రయత్నంలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. మన బలహీనతలైన కులాలు, మతాలే వారి ఆయుధాలు. వాటి పేరుతో ప్రజలను రెచ్చగొట్టి, వారి మనోభావాలను దెబ్బతీసి తద్వారా శాంతిభద్రతలను ఆటంకపరచాలని పథకం పన్నారు. ఇందులో మన శత్రుదేశం పాత్ర ఉంది. విచ్చల విడిగా నగదు సహాయం, వ్యక్తుల సహాయం అందజేస్తోంది. ఎంతో గుట్టుగా దీనికి ప్లాన్ చేస్తున్నారు. ఆరు నెలల తర్వాత వారి ప్రణాళిక అమలు చేయనున్నట్టు తెలిసింది.." కొద్ది క్షణాలు ఆగాడు రా చీఫ్. అక్కడంతా నిశ్శబ్దం.

"దీనికి సంబంధించిన ఇన్ఫర్మేషన్ సంపాదించటానికి చాలా డబ్బు పంచాలి. అవసరం మనది. మనుష్యులనీ కొనాలి. మనలో కొంత మంది ధనానికి గానీ, వేరే కారణాల వల్లగానీ వారికి సహకరిస్తూ ఉన్నారు అని చెప్పటానికి నేను సిగ్గు పడుతున్నాను. క్యాష్ రూపంలోనే ఆ డబ్బు మనకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలి. అందుకని ప్రభుత్వం మీ సహాయం కోరుతోంది.."

"నేనేం చేయాలి?" వెంటనే అడిగాడు మూర్తి.

"మీ బ్యాంక్ స్ట్రాంగ్ రూంలో మేము క్యాష్ పెడతాం. కొన్ని కోట్లు.. ఎక్కడా లెక్కలు ఉండవు.

అవసరమైనప్పుడు మా వాళ్లు వచ్చి అవసరమున్నంత తీసుకుపోతారు. మాకు కేవలం స్టోరేజ్ ప్లేస్, భద్రత, ఎవరికీ అనుమానం కలగని జాగా కావాలి. ఏమంటారు?"

"అలా అని మీరు అధికారికంగా రాసివ్వగలరా?"

"ఏంటి? రాసివ్వాలా? వాట్ ఆర్ యూ ఆస్కింగ్?"

ఆశ్చర్యం, కోపం భాషను మార్చినయి.

"సారీ సర్! మా బ్యాంకు రూల్స్ ఒప్పుకోవు."

అతని ధైర్యానికి అక్కడ ఉన్న ముగ్గురూ విస్తుబోయి నోర్లు తెరుచుకుని ఉండిపోయారు.

"నేను కాదంటే మీ అధికారంతో నన్ను ఏమైనా చేయొచ్చు సర్. కానీ నా విధులను సక్రమంగా నిర్వర్తించకపోతే, నేను తీసుకునే జీతానికి, నా జీవితానికీ విలువ ఉండదు."

రా చీఫ్ లేచి వచ్చి మూర్తిని కౌగిలించుకున్నాడు.

"మూర్తీ! నన్ను ఇంప్రెస్ చేశావు. నీలాంటి వారు ఈ సమాజానికి చాలా అవసరం. కేవలం లాటరీలో చీటి తీసినట్లు నీ పేరు ఎంపిక చేసి ఇక్కడికి పిలవలేదు. మా టీమ్ 15 మంది మేనేజర్‌లను కొన్ని వారాల పాటు క్షుణ్ణంగా పరిశీలించి నీ పేరు ఫైనల్ చేశారు తెలుసా? ఇందాక నీకు చెప్పిందంతా.. నీకో చిన్న టెస్ట్ లాంటిది. అది నిజం కాదు. ఇప్పుడు అసలు విషయంచెప్తా. విను!"

అంటుండగానే రాష్ట్ర చీఫ్ సెక్రటరీ గారి ఫోన్ మోగింది. ఎంతో అర్జెంట్ అయితే తప్ప.. డిస్టర్బ్ చేయొద్దని ముందే తన పీఏ వద్ద ఆర్డర్స్ ఉన్నాయి. అయినా ఫోన్ మోగింది అంటే చాలా ముఖ్యమైన విషయం అయ్యిఉంటుంది.

ఫోన్ ఎత్తి ఒక అర నిమిషం అవతలి వారి మాట విని. "ఓకే" లోపలికి తీసుకురండి అన్నారు ఆయన. పీఏ ఒక రెడ్ కవర్ సీల్డ్ కవర్ తెచ్చి ఆయనకు ఇచ్చి వెళ్లిపోయాడు.

ఆ కవర్ రంగు చూడగానే మూర్తి ఆశ్చర్యంగా తనలో తానే అనుకున్నాడు. ఈ రంగు కవర్ ఎక్కడో చూశాను అబ్బా, ఎక్కడ అని. ఇలాంటి రంగు కవర్‌లు బయట దొరకవు సాధారణంగా, ఎంతో వెతికితే ఏమో గానీ. చీఫ్ సెక్రటరీ ఆ కవర్ చింపి లోపలి మెసేజ్ చూసి మౌనంగా కేంద్ర హోమ్ శాఖ సెక్రటరీకి, ఆయన చూసిన రా చీఫ్‌కి ఇచ్చారు. ఆయన సన్నగా నిట్టూర్చి. 'మొదలైంది' అన్నాడు. చివరకు తేరుకొని మూర్తితో పది నిమిషాలు మాట్లాడారు ఆ ముగ్గురూ. అంతా విన్నాక మూర్తి మౌనంగా తలూపాడు, అంగీకార సూచకంగా.

"సారీ. మీ బ్యాంక్‌కు కాస్త దూరంలోనే మా వాళ్లు మిమ్మల్ని డ్రాప్ చేస్తారు. అక్కడ నుంచి మీరు వెళ్లి పోవాలి." సెక్రటరీ మాటలకు 'సరే' నంటూ లేచాడు మూర్తి.

* * *

ముందుగా అనుకున్నట్లుగానే ఆ రోజు సాయంత్రం నీహారిక, మూర్తి నెక్లెస్ రోడ్‌లో కలుసుకున్నారు. మూర్తిలో నిన్నటి ఉత్సాహం కనిపించలేదు ఆమెకి. ఏదో దీర్ఘ మయిన ఆలోచనలో ఉన్నట్లు... ఆమె ఏం మాట్లాడినా, అతను ముక్తసరిగా జవాబులు చెప్తున్నాడు. ఆమె మృదువైన పదాలు, ఎర్రగా మెరుస్తున్న సన్నటి పెదాలు, ఏవీ అతన్ని కదిలించలేకపోతున్నాయి. అసంతృప్తిగా వారి కలయిక ముగిసి, ఎవరి దారిన వారు పోవడానికి సిద్ధమవుతుండగా, నీహారిక అంది "నీతో ఓ ముఖ్యమైన విషయం చెప్పాలని వచ్చాను. కానీ నువ్వు వినే మూడ్‌లో లేవు..."

"వాట్? ఏంటది?" అతను ప్రశ్నించేలోపే అతన్ని దాటి ముందుకెళ్లిన ఆమె, ఒక్కసారి వెనక్కి తిరిగి చూసి.. చిన్నగా నవ్వుతూ సాగిపోయింది!

ఆరోజు కలత చెందిన మనసుతో మూర్తికి నిద్ర తొందరగా పట్టలేదు.

ఆ క్షణంలో అతనికి తను చూసిన ఫైలుకు, ఆ రోజు పొద్దున తను విన్న విషయానికి ఏదో సంబంధం ఉంది అనిపించింది. అప్రయత్నంగా అతని చూపు సాలెగూటి పైకి వెళ్లింది. అక్కడ చిన్న పురుగు కళేబరం వేలాడుతోంది.

సశేషం

❖❖❖❖❖




**కార్తీక పౌర్ణమి** చాలా హిందువులకు పవిత్రమైన రోజు. కార్తీక పౌర్ణమి రోజు దేవతలను ప్రసన్నం చేసుకునే రోజు. ఈ పౌర్ణమిని త్రిపురి పూర్ణిమ అని కూడా అంటారు. ఈ రోజు శంకరుడు త్రిపురాసురుడిని సంహరించాడని నమ్ముతారు. అప్పటి నుంచి శంకరుడిని త్రిపురారి అని పిలుస్తారు. ఈసారి కార్తీక పౌర్ణమి పండుగ నవంబర్ 19 (శుక్రవారం) రానుంది. నిజానికి కార్తీక మాసంలోని శుక్ల పక్షంలో వచ్చే పౌర్ణమిని కార్తీక పూర్ణిమ పండుగ ఐదురోజులు జరుగుతుంది. ఏకదశి రోజున ప్రారంభమై పౌర్ణమి రోజున ముగుస్తుంది. కార్తీక పౌర్ణమి రోజు తులసీ మాత భూమిపైకి వచ్చిందని నమ్ముతారు.

## కార్తీక పౌర్ణమిరోజున పాక్షిక చంద్రగ్రహణం..

కార్తీక పౌర్ణమి నాడు ఏర్పడే ఈ పాక్షిక చంద్ర గ్రహణాన్ని.. మంచుతో కప్పబడిన చంద్రుడిగా ఫ్రాస్ట్ మూన్ అని పిలుస్తారు. శరద్ రుతువు చివరిలో ఏర్పడే మంచు కారణంగా దానికి ఈ పేరు వచ్చింది. శరద్ రుతువు చివరి పౌర్ణమి కూడా ఇదే. అమెరికాలోని కొన్ని స్థానిక తెగలు దీనికి ఈ పేరు పెట్టాయి. ఇది సంపూర్ణ చంద్రగ్రహణంలా అద్భుతమైనది కానప్పటికీ, ఈ పాక్షిక గ్రహణం చంద్రుని ఉపరితలంలో 97% కనిపించకుండా దాచేస్తుంది.

❖❖❖❖❖


SMG Stone
SMG Stone pty ltd.
Web: http://www.smgstone.com.au
Phone : +61 2 9708 5566
Mobile : +61 418 696 672
Email: info@smgstone.com.au
STONE WITH LIFE
FOR STYLE AND ELEGANCE
FOR INDOORS AND OUTDOORS
Welcome to SMG Stone Pty Ltd . SMG Stone, based in Sydney, is committed to bring the nature to your homes from around the world. Established in 1992, SMG gained expertise in selecting, procuring and supplying natural stone from around the world. SMG has a huge selection of surfacing options for paving, building facades, lobbies, vanities, staircases and landscaping features. We are direct importers and wholesale distributors of quality natural stones such as granite, marble, slate, sandstones, cobble and the engineered stones in slab form for use in the manufacture of kitchen and vanity bench tops as well as other building uses.
Based in Sydney Australia with warehouses in Sydney and Melbourne, we are one of the reputed suppliers of an exclusive range of world class marble stone, granite and other natural stones. We import natural stone from around the world.
At SMG Stone Pty Ltd (SMG) we have the finest and largest product range. Our Sydney warehouse contain over 50,000sqm of natural stone. We have streamlined the supply chain for your convenience. We aim to achieve 100% client satisfaction by delivering a beautiful product with the highest quality and most importantly, with the right price. As project suppliers, we are able to procure natural stone according to your own specifications.
Specialized in the supply of natural stone products for hospitality, multi-family residential dwellings and institutional projects.
BRING NATURE TO HOMES
Designed by DSLRCREW

## పాట నేర్చుకుందామా/పాడుకుందామా

**చిత్రం: సంతానం**

**సంగీతం శ్రీ సుసర్ల దక్షిణామూర్తి**

**గీతరచయిత:** శ్రీ అనిశెట్టి పినిశెట్టి

**నేపధ్య గానం:** శ్రీ ఘంటసాల వేంకటేశ్వరరావు

**పల్లవి:**

ఆ..ఆ..

చల్లని వెన్నెలలో ...చల్లని వెన్నెలలో...ఓ..ఓ..ఓ..

చల్లని వెన్నెలలో చక్కని కన్నె సమీపములో ...ఓ..ఓ..

చల్లని వెన్నెలలో చక్కని కన్నె సమీపములో ...

అందమే నాలో లీనమాయెనే...ఆనందమే నా గానమాయెనే..

చల్లని వెన్నెలలో...

**చరణం 1:**

తెలి మబ్బుల కౌగిలిలో జాబిలి తేలియాడెనే ముద్దులలో

తెలి మబ్బుల కౌగిలిలో జాబిలి తేలియాడెనే ముద్దులలో

గాలి పెదవులే మెల్లగ సోకిన ...గాలి పెదవులే మెల్లగ సోకిన...

పూలు నవ్వేనే నిద్దురలో....

||చల్లని||

**చరణం 2:**

కలకలలాడే కన్నె వదనమే కనిపింతును ఆ తారలలో..ఓ

కలకలలాడే కన్నె వదనమే కనిపింతును ఆ తారలలో...

కలకాలము నీ కమ్మని రూపము ...కలకాలము నీ కమ్మని రూపము

కలవరింతులే నా మదిలో...ఓ..ఓ..

||చల్లని||

https://www.youtube.com/watch?v=_bxjTy1lGbA

❖❖❖❖❖

# శిధిల నగరం – 9

(నెవిల్ షూట్ నవల "Ruined city" కి అనువాదం)

అనువాద కర్త: జి.వి.సోమనాధ శాస్త్రి (సోమసుధ), హైద్రాబాద్

@@@@@@@@@

(కడుపులో నొప్పితో మెలికలు తిరిగే వారన్ని ఒక లారీ డ్రైవరు తన లారీలో, దారిలో కలసిన కానిస్టేబుల్ సలహాతో, షార్పుల్స్ ఆసుపత్రికి చేర్చి వెళ్ళిపోతాడు. డాక్టర్ అతనికి పెరిటోనిటస్ గా నిర్ధారిస్తాడు. అతనికి మత్తు ఇంజెక్షన్ యిస్తారు. ఆ మగతలో తనను ఒక నిరుద్యోగిగా ఆసుపత్రి సిబ్బంది అనుకోవటం వారన్ వింటాడు. సర్జన్ కూడా వచ్చి పరీక్ష జేసి వారన్ కి శస్త్రచికిత్స చేయాలని నిర్ధారిస్తాడు. తరువాత. . .)

@@@@@@@@@@@@@

ముసలాయన లేచి నిలబడ్డాడు. "వెంటనే ఆపరేషను చేస్తాను" అని సిస్టరుకి చెప్పాడు. "ఇతన్ని త్వరగా సిద్ధం చేసి ధియేటరుకి తీసుకొని రండి" అన్నాడు. తరువాత వారన్ వైపుకి తిరిగి, "నువ్వు తప్పకుండా కోలుకొంటావు" అని ధైర్యం చెప్పాడు.

సర్జన్, డాక్టర్లు వెళ్ళిపోయిన కొద్ది క్షణాల్లోనే యిద్దరు వ్యక్తులు స్ట్రెచర్ తో వచ్చి అతన్ని ఆపరేషను ధియేటరుకి తీసుకెళ్ళారు.

@@@@@

అదే సమయంలో మోర్టిమర్ నివాసమైన గోడమింగ్ లో, వారన్ ఆంతరంగిక కార్యదర్శి మోర్గాన్, వార్ధక్యం వల్ల నీరసించిన, డెబ్బై ఎనిమిది ఏళ్ళ మోర్టిమర్ దగ్గర కూర్చుని ఉన్నాడు.

"సార్! ఇదే జరిగింది" అతనితో చెప్పాడు. "అతను యిల్లు విడిచి మూడు రోజులైంది. ఆ విషయం మీకు కూడా తెలుసనుకొంటాను."

ముసలాయన ఒక్క క్షణం ఆలోచనలో పడ్డాడు. "అతను కొన్నాళ్ళు బయటకెడతానని చెప్పాడన్నావు కదూ!"

"అది నిజమేనండీ! కానీ తను ఎప్పుడు బయటకు వెళ్ళదలచుకొన్నారో చెప్పలేదు. కనీసం ఎక్కడ నాకు అందుబాటులో ఉంటారో కూడా చెప్పలేదు."

"ఒక్క డ్రైవరుకి తప్ప యింట్లో పనివాళ్ళెవరికీ అతనెక్కడికి వెళ్ళేదీ తెలియదు కదూ!"

"అవునండీ! డ్రైవరు చనిపోయాడు."

"హు!"

ఇద్దరి మధ్య కొద్ది సేపు నిశ్శబ్దం తాండవించింది. తిరిగి మోర్గానే చెప్పసాగాడు, "అతను మూడొంతులు ఖచ్చితంగా ఈ దేశంలోనే బహుశా ఉత్తర ఇంగ్లాండులో గానీ, స్కాట్లాండ్ లో గాని ఉండి ఉంటారు. మీకిది తెలివైన పని అనిపిస్తే, నేను బి.బి.సి.లో ప్రకటన యిద్దామని అనుకొంటున్నాను సార్!"

"వద్దు" ముసలాయన వెంటనే బదులిచ్చాడు. కొద్ది క్షణాల మౌనం తరువాత అతనే తిరిగి చెప్పాడు, "ప్రజల విశ్వాసాన్ని కోల్పోయే పనేదీ చేయొద్దు. విశ్వాసం మన బాంకింగ్ వ్యవస్థకు ఆస్తి లాంటిది. ఏ చిన్న తేడా కనిపించినా, డిపాజిట్టుదారులు తమ సొమ్మును బాంకు నుంచి వెనక్కు తీసుకొనే ప్రమాదము ఉంది. అందుకే దాన్ని విచ్ఛిన్నం చేయొద్దు" అంటూ మరి కొంతసేపు ఆగాడు. " ప్రస్తుతం తీవ్రమైన నిర్ణయాలు తీసుకోవలసినంత అగత్యం నాకు కనిపించటం లేదు. అతన్ని ఒంటరిగా వదిలేయండి. అతను గొర్రెలాగ తిరిగి వస్తాడు. తన వెనుక తోకను ముడుచుకొని మరీ. . అర్థమైందనుకొంటా! "

మోర్టిమర్ మాటలకు మోర్గాన్ మర్యాద పూర్వకంగా నవ్వాడు.

"వెంటనే చూడాల్సిన పనులేమీ లేవంటున్నావుగా! అంత అవసరమైతే, ఆ కాగితాలేవో నా దగ్గరకు తీసుకొని రా! బయట అందరికీ అతను సెలవులో వెళ్ళాడని చెప్పు. వాళ్ళకు నిజమే చెప్పు. పతితురాలైన అతని భార్య నల్లోడితో లేచిపోయిందని, ఆ గొడవలు చూసుకోవటానికి అతను ఒకటి, రెండు వారాల పాటు బయటకెళ్ళాడని చెప్పు. తరువాత. . . . ఎప్పుడూ నాకు టెలిఫోనులో అందుబాటులో ఉండి, జరిగే పరిణామాలను నా దృష్టికి తీసుకొస్తూండు. "

" అలాగేనండీ!"

మోర్టిమర్ తన చూపులను దూరానికి కేంద్రీకరించాడు. "అతను తప్పక తిరిగొస్తాడు. కానీ చాలా విచిత్రమైన మనిషి. అందుకే భయపడుతున్నాను. అతనికి ప్రస్తుతం సంభవించిన యిలాంటి సంఘటన, ముమ్ముందు తన జీవితంలో ఎలాంటి మార్పును తెస్తుందో!"

@@@@@@@@@@@@@@@@@@@@

శస్త్రచికిత్స జరిగిన మూడు రోజుల తరువాత వారన్ తన చుట్టూ ఉన్న పరిసరాలను గుర్తించసాగాడు. ఈ మూడు రోజుల్లో మరొక ఆలోచన లేకుండా తన గుర్తింపు విషయంలో ఒక నిర్ణయానికి వచ్చాడు. సిస్టర్ తనకొక విశ్వసనీయమైన కథనిచ్చింది. అదే కథను తాను అంగీకరించి పోషించదలుచుకొన్నాడు. అదే ప్రస్తుతం తనకు మంచిది. కూలి వాళ్ళ వార్డులో ప్రసిద్ధి చెందిన బాంకు నిర్వాహకుడిగా ఉండాలన్న కోరిక తనలో లేదు.

మూడవ రోజు ఉదయం సిస్టర్ తనను శుభ్రం చేస్తూండగా, ఆ ప్రాంతం పేరేమిటని అడిగాడతను.

ఆమె అతన్ని తెల్లబోయి చూసింది.

" అదే! ఈ ఊరి పేరేమిటో చెబుతారా?" తిరిగి అడిగాడు.

" షార్పుల్స్" చెప్పిందామె.  " నీకు తెలియదా?"

" లేదు.  నేను ఎక్కడో రోడ్డు మీద పడి ఉంటే, యిక్కడకు తీసుకొచ్చారు."

" అవును.  లారీలో వచ్చావు కదూ!  ఇంతకీ నువ్వెక్కడి నుంచి వస్తున్నావు?"

" గ్లాస్గో" టక్కున బదులిచ్చాడు.   "నేను హల్ పట్టణానికి పోతున్నాను.   గతంలో అక్కడే పని చేసాను.  అందుకే అక్కడ పని దొరుకుతుందని వెడుతున్నాను. "

ఆమె నుంచి ఎలాంటి స్పందన లేదు.   వారన్ తాను విన్న కధనే జీర్ణం చేసుకొంటున్నాడు.

" ఇక్కడ నౌకానిర్మాణం చేస్తారు కదూ!" అడిగాడు.

" ఒకప్పుడు.  అయిదేళ్ళ క్రితం బార్లోస్ కంపెనీ మూతబడింది.  ప్లేట్  మిల్లులు,  వండ్రంగం కంపెనీలు కూడా మూతబడ్డాయి.  అప్పటి నుంచి ఇక్కడ ఒక్క ఓడ కూడా తయారవలేదు."

వారన్ సాలోచనగా తలూపాడు.   ప్రస్తుతం తానెక్కడున్నదీ అర్ధమైంది.   కొన్నేళ్ళ క్రితం బార్లో అంశం తన ముందుకొచ్చింది;  ఒక్కసారి కాదు అనేక పర్యాయాలు.  ఈ అంశం నగరమంతా కొంతకాలం డేగలా సంచరించి, నెమ్మదిగా కనుమరుగై పోయింది.
" ఇక్కడ అనేక రకాల ఓడలు నిర్మించారని విన్నాను."

“అవును.   హెదర్ లైన్ పడవలు, మయ్యర్స్ పడవలను బార్లోస్ కంపెనీ తయారుచేసేది.   ఫ్లోటింగ్ డాక్స్ వంటి అనేక విదేశీ కంపెనీలు కూడా చాలా ఉండేవి.   యుద్ధ నౌకలకు సంబంధించిన పని కూడా జరిగేది.   జెట్లాండ్ యుద్ధంలో ఏడు బార్లో విధ్వంసక నౌకలు పాల్గొన్నాయి.   ఆ విషయం విన్నావా?" అంటూ ఆమె కొద్ది క్షణాలు ఆగింది.   "ఆ రోజులకి, యిప్పటికి చాలా మార్పొచ్చింది."

ఆమె వెళ్ళిపోయాక, తను విన్న దానిని ఒకసారి విశ్లేషించుకొన్నాడతను.

అతను ఉన్న వార్డుకి యిరువైపులా కిటికీలు ఉండటం వల్ల రెండు ప్రక్కల నుంచి లోపలకు గాలి, వెలుతురు బాగానే వస్తున్నాయి.   ఆ వార్డులోని మంచాలు శుభ్రంగాను, నొంపుగాను సర్ది ఉన్నాయి.  ప్రతి మంచం మీద రోగుల కాళ్ళ దిక్కున ఎర్రని దుప్పటి పద్ధతి ప్రకారం మడత పెట్టి ఉంది.   ప్రతి మంచం పక్కన ప్రామాణికమైన ఒక లాకర్ ఉంది.  ఆ గదిలోని రెండు మంచాల చుట్టూ మాత్రం పరదాలు అమర్చి ఉన్నాయి.

వారన్ తన మంచంపై పడుకొనే, చుట్టూ ఉన్న పరిసరాలను అధ్యయనం చేసాడు.  ఆ సాధారణ వార్డు శుభ్రంగాను, ముచ్చటగాను ఉన్నప్పటికీ, ఏదో లోపం ఉన్నట్లు అతనికి అనిపించింది.   అరగంట తరువాత అతనికి ఆ లోపమేంటో

అర్థమైంది.  ఆ గదిలో యిరుపక్కలా ఎదురెదురుగా రెండేసి చొప్పున మొత్తం పన్నెండు కిటికీలు, చివరలో అదనంగా మరొక కిటికీ వెరసి పదమూడు కిటికీలు ఉన్నాయి.  ఆ గదిని రూపొందించిన రూప శిల్పి, ఎదురెదురుగా ఉన్న రెండు కిటికీల

మధ్యన ఒక మంచం ఉండేలా ప్లాను గీసాడు.  కానీ ఆ గదిలో వరుసకి తొమ్మిది మంచాల చొప్పున రెండు వరుసల్లో సర్దారు.  వార్డు చివర్లో మంచానికి అవకాశం లేని చోట ఒక మంచాన్ని యిరికించారు.  ప్రస్తుతం ప్రతి మంచం మీద రోగి ఉన్నాడు.  అంటే పన్నెండు మంచాలు ఉండాల్సిన గదిలో పందొమ్మిది మంచాలున్నాయి.

తల తిప్పిన వారన్ కి తన వైపే చూస్తున్న పక్క మంచంలోని మనిషి కనిపించాడు.  పొడుగ్గా, బక్కపలచగా, తల నెరిసిన అతనికి ఏభై ఏళ్ళ పైనే ఉంటాయి.  అతను కదలకుండా పడుకొని ఉన్నాడు.

వారన్ తనను గమనిస్తున్న అతన్ని "శుభోదయం " అని పలకరించాడు.

కొద్ది క్షణాల నిశ్శబ్దం తరువాత ఆ మనిషి పలికాడు.  "నీ పేరేంటి?"

"వారన్.  నీది?"

"పీటర్సెన్. జాక్ పీటర్సెన్ అంటారంతా.  నీది ఈ యిలాకా కానట్టుందే?"

"అమెరికా నుంచి వచ్చాను" వారన్ బదులిచ్చాడు. "ఫిలడెల్ఫియాలో పనిచేసే వాణ్ణి."

అతని నెరిసిన ముఖంలో కాంతి తొణికిసలాడింది.  "అమెరికాల అంతా బాంటదా? రివెట్రుకి ఆడ పని దొరుకుద్దా?"

"దొరుకుతుందనుకోను.  అక్కడ పరిస్థితులు బాగు లేవు."

"కుసింతైనా ఆస లేదంటవా?"

"నేను చెప్పలేను.  అక్కడ యిప్పటికే పది మిలియన్ల పైన ఉద్యోగం పోగొట్టుకొన్న వాళ్ళు ఉన్నారు."

ఆ చిక్కిన మొహంలో ఉత్సాహం చచ్చిపోయింది.  నీరసంగా మరొక ప్రశ్న వచ్చింది.

"ఆడ నుండి ఎందుకొచ్చేసినవ్?"

"బాంకులో పనిచేసేవాణ్ణి" వారన్ చెప్పాడు.  "గత సెప్టెంబరులో నాతో పాటు పదిహేను మందిని పని లోంచి తీసేశారు.  అక్కడే పని కోసం నా దగ్గరున్న డబ్బంతా ఖర్చు పెట్టి తిరిగాను.  వాళ్ళు నన్ను పట్టుకొని పడవెక్కించి గ్లాస్గో పంపించారు.  నీ కాగితాలను వెనక్కి తీసుకోక పోతే, వాళ్ళు చేసేదదే!"

"గ్లాస్గీ  నుంచొచ్చేవా?" పీటర్సెన్ అడిగాడు.  "నేనాడకి మరోసారి యెళ్దామనుకొంటున్నా!"

కొద్దినిమిషాల మౌనం తరువాత మళ్ళీ అడిగాడతను. "జబ్బేటి?"

"పేగు మడత బడిందట!" వారన్ చెప్పాడు. " దానిలో కొంచెం ముక్కను కత్తిరించేసి, మిగిలిన దాన్ని అతికారు. గాయం మానాక నేను పూర్వంలాగే మంచిగా ఉంటానని చెబుతున్నారు. కానీ నేనా మాటలు నమ్మటంలేదు."

"అయ్! అది సత్తెం కాదని సెప్పలేను. సూత్తంటే బాగా తగ్గినట్లుందే!"

"నీ సంగతేమిటి?"

"కడుపులో యిపరీతంగా నెప్పొచ్చిందని ఒచ్చినా! కొన్నాళ్ళు సూత్తామని ఈడ పెట్టారు."

"ఆ నొప్పి చాలాకాలంగా ఉందా?"

"మూణ్ణెల్లు. తిన్నా, తాగినా ఈ నెప్పొత్తది. ఈ పొత్తికడుపు నొప్పితో రేతిర్లో నిద్ర కూడ ఉంటంలా! ఏదో ఓ.పి.లో సీపిచ్చుకుని మందిత్తే పుచ్చుకొందారనుకున్నా. కానీ ఆడుండే కుర్ర డాట్రు మూడు పింట్ల పాలు రోజు తాగమంటడు.
బుద్ధిలేనోడు. నువ్వెప్పుడైనా అలాంటి పిచ్చి మాట్లిన్నావా? ఒక పింటు అంటే పన్నెండు అగున్సుల పాలకు మూడు పెన్నీలవుద్ది. దాంతో సరిపోదట. బేబీ ఫుడ్డు, యింకా ఏవో రకాలు సెప్పాడు. అదేదో సంగమోళ్ళు మేము బతకటానికి వారానికి ముప్పై ఒక్క షెల్లింగుల ఆరు పెన్నీ లిత్తారు. ఆ మొత్తంతో వారమంతా మా కొంపలో నలుగురు బతకాల. వచ్చిందాంట్లో తొమ్మిది షెల్లింగుల 3 పెన్నీలు యింటద్దెకు పోతది. అందుకే అయన్నీ యీలు కాదని సెబితే, యిదిగో, నిన్ను కొద్ది రోలు సూడాలని యీడ బెట్టారు."

"ఇప్పుడు నీకు పాలు దొరుకుతున్నాయా?" వారన్ అడిగాడు.

"అయ్! యిసిగించేత్తన్నారు."

వారన్ కు అటు వైపు మంచం మీద థాంప్సన్ అనే కుర్రాడు ఉన్నాడు. అతను ఓడరేవులో కూలీగా పని చేస్తున్నాడు. అతను ఎపెండిసైటిస్ నుంచి మెల్లిగా కోలుకొంటున్నాడు. అతను మితభాషి, ఫుట్ బాల్ విషయాల మీద ఆసక్తి
ఎక్కువ. అయినప్పటికీ అతను వారన్ కి ఒక విలువైన సలహా యిచ్చాడు.

"చూడన్నా!" బొంగురుగొంతుతో చెప్పాడు. "మిస్ మెక్మహన్ని కనిపెట్టుకొని ఉండు. ఆమె వాళ్ళు చేసిన దానికి నీ చేత డబ్బులు కట్టించాలని చూస్తుంది. కానీ ఆ పని మాత్రం చేయకు. నీకు ఎలాంటి గేలం దొరికినా వదిలిపెట్టకు. ఇక్కడున్న అందరిలాగే నీకిక్కడ ఉచితంగా ఉండే హక్కుంది."

వారన్ సేకరించిన సమాచారం ప్రకారం మిస్ మెక్మహన్ నిజాయితీ గల ఉద్యోగి. ఆసుపత్రిలో ఉన్న రోగుల కుటుంబాలకు, అక్కడనుంచి డిశ్చార్జ్ అయిన రోగులకు సాయం చేసే దొడ్డ గుణం కల వ్యక్తి. ఆసుపత్రిలో చేరిన వారినుంచి బిల్లులు వసూలు చేయటమే గాక, రోగుల సంక్షేమానికి ఎవరైనా దాతలు పుస్తకాలు, వస్తువుల వంటివి యిస్తే, వాటిని వారికి పంచటమే గాక,

అప్పుడప్పుడు రోగుల యోగక్షేమాలను విచారిస్తూ వారిని ఆనందంగా ఉంచటానికి ప్రయత్నిస్తూంటుంది. అక్కడ ఆసుపత్రిలో ఆమె విధుల్లో అది కూడా ఒక భాగమే! ఆమె నిర్వహించే పదవిని ఆల్మనర్ అంటారు. కానీ థాంప్సన్ ఓడరేవులో కూలీ గనుక తిరుగుబాటు ధోరణితో ఆమె మీద అలా చెబుతున్నాడని వారన్ గ్రహించాడు.

థాంప్సన్ మంచానికి అవతల పక్క, గదిలో మూలగా ఉన్న మంచం చుట్టూ పరదా అమర్చి ఉంది. దాని వెనుక నుంచి అప్పుడప్పుడు చిన్న పిల్లల్లా మాటలు, ప్రేలాపనలు గట్టిగా వినిపిస్తున్నాయి. అటూ యిటూ పరుగులు తీస్తున్న నర్సుల ద్వారా ఆ రోగి పరిస్థితి వికటించినట్లు వారన్ గ్రహించాడు. తనకు తాగటానికి పాలు తెచ్చిన వార్డు నర్సుని వివరాలడిగాడు.

"అతను టింబ్లీ అనే యువకుడు" ఆమె చెప్పసాగింది. "అతను వడ్రంగం పని చేసే వాడనుకొంటా. ఏదో బరువెత్తుతూ గాయపడితే శస్త్రచికిత్స చేశాం. అతని గాయం మాని పూర్తిగా కోలుకొన్నాడనే అనుకొన్నాం. కానీ గాయం కుళ్ళిపోయి పరిస్థితి విషమించింది."

కలవరంతో వారన్ కనుబొమలు ముడిచాడు. "అలా సెప్టిక్ అవటానికి కారణమేంటి?"

"నాకు పూర్తిగా తెలీదు. అతనికి నిర్లక్ష్యం ఎక్కువ. నోటిని కట్టుకోడు. అదే కారణమై ఉండొచ్చని డాక్టరు మిల్లర్ అంటున్నారు."

ఆమె వెళ్ళిపోయాక, వారన్ నిద్ర పట్టే వరకు నర్స్ మాటలనే తలచుకొని కలవరపడ్డాడు.

**(సశేషం)**

❖❖❖❖❖

**చిత్రకళ – శ్రీమతి ప్రసూన రవీంద్రన్ - హైద్రాబాద్**



**మీరా – కృష్ణ భక్తి**


Apex
Dental Centre
Gentle, caring, quality dentistry
FREE Initial Consultation*
✓ General & preventative care
✓ Complete family care
✓ Cosmetic dentistry
✓ Gum disease and bad breath
✓ Crowns & Bridges
✓ Implants
✓ Full and partial dentures
* For non health fund members and no gap for health fund members.
We have Hindi, Telugu, Kannada, Marathi, Gujrati speaking dentists
FOUR CONVENIENT LOCATIONS
BAULKHAM HILLS
Suite 110, 10 Century Cct
Tel: 8850 4525
LIVERPOOL
Suite 4,61 Moore St
Tel: 9602 7815
QUAKERS HILL
206 Farnham Rd
Tel: 9626 5553
WENTWORTHVILLE
31/15-17 Lane St
Tel: 98964949
CALL TODAY FOR AN APPOINTMENT 1300 APEX DENTAL
www.apexdentalcentre.com.au